నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

కొత్త సచివాలయానికి ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 19: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం నడిబొడ్డున నూతనంగా నిర్మిస్తున్న సచివాలయానికి ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం సాయంత్రం వచ్చారు. సచివాలయ నిర్మాణ పనులను సీఎం పరిశీలిస్తున్నారు. సమీకృత సచివాలయం పనులు ఇప్పటికే 70 శాతం పూర్తయ్యాయి.

దసరా పండుగ నాటికి కొత్త సచివాలయంలో అందుబాటులోకి రానుంది. ఈ నేపథ్యంలో కొత్త సెక్రటేరియట్ నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు సీఎం కేసీఆర్ సచివాలయ నిర్మాణ పనులను పరిశీలించిన విషయం విదితమే.

హైదరాబాద్ బుధవారం 20-4-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 211 పేజీలు:4 వెల: రూ.1/-

తెలంగాణకు కరువన్నదే రాదు- సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 19: భవిష్యత్తులో తెలంగాణ వ్యవసాయ రంగానికి ఇక కరువు అనే సమస్యే ఉత్పన్నం కాదని కేసీఆర్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ రంగ వేగాన్ని వ్యవసాయ శాఖ అధికారులు అందుకుంటూ ముందుకు సాగాల్సి వున్నది. వ్యవసాయ శాఖ నిరంతరం వైబ్రంట్ గా, బిజీ బిజీగా వుండాల్సి వున్నదని వ్యవసాయ శాఖ మంత్రికి, అధికారులకు సీఎం కేసీఆర్ సూచించారు.

వ్యవసాయ రంగం బలోపేతానికి, జిల్లా వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికలను (డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్ యాక్షన్ ప్లాన్) చేపట్టాలని సీఎం సూచించారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్లను, ఆర్డీవోలను కూడా భాగస్వాములను చేయాలని సీఎం ఆదేశించారు.వ్యవసాయమే ప్రధాన వృత్తిగా వున్న భారతదేశంలో వ్యవసాయాభివృద్ధికి పాటుపడాల్సిన కేంద్ర ప్రభుత్వం, వ్యవసాయ రంగాన్ని కుదేలు చేసేలా తిరోగమన విధానాలు అవలంబిస్తుండడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టించి పనిచేస్తున్న దేశ రైతాంగాన్ని ప్రోత్సహించకుండా నిరుత్సాహపరిచే చర్యలు చేపట్టడం, దేశంలో పంటల దిగుబడిని పెంచే దిశగా కాకుండా ఉత్పత్తిని తగ్గించే విధంగా అపసవ్య విధానాలను అమలు చేస్తుండడం బాధాకరమని సీఎం కేసీఆర్ అన్నారు.

ఎన్ని అడ్డంకులు ఎదురైనా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేస్తుందని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగ సంక్షేమం కోసం కార్యాచరణను మరింత పటిష్టంగా కొనసాగిస్తూనే ఉంటుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. మరికొద్ది నెలల్లో వానాకాలం రానున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రికి, అధికారులకు సీఎం సూచించారు. పత్తి, మిర్చి, కంది, వాటర్ మెలన్‌తో పాటు తదితర ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని కేసీఆర్ సూచించారు.

రాష్ట్రంలో ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచడం, వానాకాలం వ్యవసాయ ముందస్తు ఏర్పాట్ల సన్నద్ధత పై ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ మంగళవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. రాష్ట్రంలో ఇప్పటికే ప్రారంభించిన వరి ధాన్యం సేకరణ పురోగతి పై అధికారులను సీఎం ఆరా తీశారు. లాభదాయక పంటల సాగుపై ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. జిల్లా స్థాయి వ్యవసాయ అధికారులు మరింత విస్తృతంగా క్రేత్రస్థాయిలో పర్యటించాలని, గ్రామీణ స్థాయిలో పనిచేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు నిరంతరం పంటపొలా ల్లో, గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు తగు సూచనలు అందించాలన్నారు. ఆ దిశగా అవగాహన పెంపొందించాలని,అందుకు ఏఈ అధికారులకు నిరంతరం శిక్షణా తరగతులను నిర్వహించాలని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డికి సీఎం సూచించారు. వ్యవసాయ అధికారుల బాధ్యతలు, విధుల నిర్వహణపై జాబ్ చార్ట్ తయారు చేయాలన్నారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్న వ్యవసాయ రంగం

ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో వ్యవసాయానికి వాతావరణం అనుకూలంగా ఉంది. సరిపడా వానలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ రంగం ఆశాజనకంగా ఉండబోతున్నది. రైతులు యాసంగి పనులను ముగించుకున్నారు. వానాకాలం సీజన్ త్వరలో ప్రారంభం కానున్నది. ఈలోపే అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు సరిపడా సమకూర్చుకోవాలి. రైతులకు ఎటువంటి లోటు రాకుండా వాటిని అందుబాటులో ఉంచుకోవాలి. కల్తీ విత్తనాల తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి అని ఆదేశించారు. నేడు తెలంగాణ వ్యవసాయం గొప్పగా పురోగమిస్తున్నది. ఉమ్మడి పాలనలో నాడు నామమాత్రంగా వున్న వ్యవసాయ రంగం, నేడు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో రాష్ట్ర జిఎస్డిపికి 21 శాతం దోహదపడుతున్నది. ఇది మామూలు విషయం కాదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో వ్యవసాయ రంగం కీలకంగా మారింది. ప్రాణహిత కాళేశ్వరం ప్రాజెక్టు మరింతగా విస్తరిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు రానున్న ఏడాదిలో పూర్తవుతాయని కేసీఆర్ తెలిపారు.

ఎరువుల విచ్చలవిడి వాడకాన్ని తగ్గించాలి

యూరియా, ఎరువుల వాడకాన్ని తగ్గించి, శాస్త్రీయ పద్ధతులను అవలంభిస్తూ, మోతాదుగా వాడేలా రైతులకు అవగాహన పెంచాలని సీఎం అధికారులకు సూచించారు. విపరీతమైన ఎరువులు, పురుగుమందుల వాడకంతో భూములు పాడవుతాయన్నారు. పంటలమార్పిడి చేయకుండా ఒకే పంటనే ఏండ్ల కొద్దీ వేయడం ద్వారా, నేల సహజ స్వభావం తగ్గి రోజు రోజుకూ భూసారాన్ని కోల్పోతున్నదని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పంటల మార్పిడితో భూసారాన్ని పరిరక్షించుకోవడం తక్షణావసరమని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ దిశగా తగు ప్రణాళికలను సిద్ధం చేసుకుని రైతులను చైతన్య పరచాలని మంత్రిని, అధికారులను కేసీఆర్ ఆదేశించారు.

అన్నం అంతా ఒకేసారి తింటమా?

యూరియాను ఒకేసారి పెద్ద మొత్తంలో కాకుండా పద్ధతిగా వినియోగించాలని సీఎం సూచించారు. ఇందుకు వ్యవసాయ అధికారుల సలహాలను రైతులు తీసుకోవాలన్నారు. కొంతమంది రైతులు ఎరువులు ఎక్కువ వేస్తే దిగుబడి పెరుగుతదని అనుకుంటరు. కానీ కాదు. ఏదైనా మోతాదుగా వాడుకోవాల్సిందే. మనం అన్నం తింటే ఒకేసారి తింటమా? తినం కదా?ఎరువులు కూడా అంతే. పంటలు కూడా మానవ శరీరం లాంటివే. వాటికి ఆహారం ఎంతకావాల్నో అంతే తీసుకుంటాయి. మోతాదుకు మించి తిండి తింటే మనకు రోగాలు వచ్చినట్టు వరిపంటకు కూడా మోతాదు మించి ఎరువులు చల్లితే ఏపుగా ఎదగాల్సిన పంట ఆగమైతదని సీఎం తెలిపారు.

ఎకరానికి ఒక యూరియా బస్తాను ఒకసారే వేయవద్దని, వరి పెరుగుతున్నా కొద్దీ సమయానుకూలంగా మూడు నాలుగు సార్లు వినియోగించాలని కేసీఆర్ సూచించారు. డిఏపి తదితర కాంప్లెక్సు ఎరువులను కూడా విపరీతంగా వాడకుండా, తగుపాళ్లలో వాడాలని రైతాంగాన్ని కోరారు. మారుతున్న కాలాన్ని బట్టి ఎరువులను ఎట్లా వాడాల్నో వ్యవసాయ అధికారులు రైతువేదికల ద్వారా రైతులను సమావేశ పరిచి అవగాహనా కార్యక్రమాలను చేపట్టాలని సీఎం ఆదేశించారు.

ఎరువుల నిల్వలపై ఆరా

కాగారానున్న వానాకాలం సీజన్‌లో అందుబాటులో ఉంచాల్సిన డిఏపి, యూరియా తదితర ఎరువుల నిల్వలపై అధికారుల నుంచి సీఎం ఆరా తీసారు. యూరియా, డిఏపి తదితర ఎరువుల నిల్వలు చాలినంతగా వున్నాయని ముఖ్యమంత్రికి అధికారులు నివేదిక అందించారు.

యుద్ధం నేపథ్యంలో పొదుపు

డిఏపి తయారీలో వినియోగించే ముడిసరుకులు రష్యా, ఉక్రేయిన్ తదితర దేశాలనుంచే దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో అక్కడ యుద్ధం జరుగుతున్నదని ఈ పరిస్థితుల్లో డిఏపి లభ్యత అవసరానికి మించి వుండబోదని సీఎం కేసీఆర్ దృష్టికి అధికారులు తెచ్చారు. కాగా ఈ పరిస్థితుల్లో విచ్చలవిడిగా డిఏపి వాడకాన్ని తగ్గించి తగు మోతాదులో పొదుపుగా వాడుకోవాలనే విషయం పట్ల రైతులకు అవగాహన కల్పించాలని కేసీఆర్ సూచించారు. భూసారాన్ని పెంచే దిశగా కార్బన్ కంపోనెంట్ల వాడకాన్ని వినియోగించాలని పచ్చిరొట్ట వాడాకాన్ని పెంచాలన్నారు.

వరి పంటకు ప్రత్యామ్నాయం

వరిపంటను విపరీతంగా వేయడం ద్వారా భూసారం తగ్గిపోయే ప్రమాదం వుంటుందనే శాస్త్రీయ అధ్యయనాలను అధికారులు సీఎం కేసీఆర్ దృష్టికి తెచ్చారు. కాగా లాభదాయక పంటలను ఎంచుకుని పంటల మార్పిడి దిశగా రైతులను చైతన్య పరచాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

తెలంగాణ పత్తికి డిమాండు

కరోనా అనంతర పరిస్థితుల్లో ప్రపంచ మార్కెట్లో చైనా తదితర దేశాల పత్తి దిగుబడి తగ్గిపోతున్న నేపథ్యంలో, తెలంగాణ పత్తికి డిమాండు పెరుగుతున్న అంశంపై కేసీఆర్ సమీక్షించారు. క్వింటాల్ పత్తికి 10 వేలనుంచి 13 వేలదాకా ధర పలుకుతున్న విషయాన్ని సమావేశం చర్చించింది. రానున్న కాలంలో మరింతగా పత్తికి గిరాకీ పెరగనున్నదనే విషయాన్ని గుర్తించింది. ఈ నేపథ్యంలో పత్తి పంట సాగును మరింతగా ప్రోత్సహించాలని సిఎం అధికారులను ఆదేశించారు. అదే సందర్భంలో మిర్చికి కూడా ఊహించని రీతిలో క్వింటాల్ కు 42 వేలకు పైగా ధర పలకడం గొప్ప విషయమని సీఎం అన్నారు. కంది కూడా మార్కెట్లో డిమాండు వున్న పంటేనని, కందిసాగు విషయంలో వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం వహించరాదన్నారు. సన్ ఫ్లవర్ పంట విస్తీర్ణాన్ని పెంచాలని కేసీఆర్ సూచించారు.

వెదజల్లితే లాభం

వరి సాగులో వెదజల్లుడు విధానాన్ని మరింతగా ప్రోత్సహించడం ద్వారా రైతుకు అన్ని విధాలుగా ఖర్చు తగ్గించవచ్చని సీఎం చెప్పారు. ఎరువుల వాడకం, వెదజల్లడం తదితర వ్యవసాయ అంశాలకు సంబంధించి రైతులను చైతన్యపరిచే దిశగా డాక్యుమెంటరీలు తదితర ప్రచార కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని అధికారులకు సిఎం సూచించారు.

కల్తీ విత్తనాలపై ఉక్కుపాదం

కల్తీ విత్తన తయారీదారులను వారి మూలాలను గుర్తించి కట్టడి చేయాలని సీఎం ఆదేశించారు. అందుకోసం పోలీసు యంత్రాంగం సహకారం తీసుకోవాలని వ్యవసాయ శాఖకు సీఎం సూచించారు. ఇప్పటినుంచే ఫ్లయింగ్ స్క్వాడ్లను రంగంలోకి దించాలన్నారు.

ధాన్యం సేకరణ పై కేసీఆర్ ఆరా

రాష్ట్రంలో ఇప్పటికే యాసంగి వరి ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే సేకరిస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన కార్యాచరణ ఎట్లా కొనసాగుతున్నదనే విషయాన్ని మార్కెటింగ్ శాఖ కమిషనర్ అనిల్ కుమార్ నుంచి సీఎం కేసీఆర్ ఆరా తీశారు. కాగా.. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం సేకరణ పుంజుకున్నదనీ, గన్నీ బ్యాగులు, హమాలీలు, రవాణా వాహనాలు, నిల్వ కేంద్రాలు తదితర అవసరాలను సమకూర్చుకున్నామని అనిల్ కుమార్ సీఎంకు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6983 కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇప్పటికే 536 కేంద్రాలను ప్రారంభించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 32 కేంద్రాల నుంచి సేకరణ మొదలయ్యిందని ఇప్పటికే 1200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని కమిషనర్ సీఎంకు వివరించారు.

గ్రేటర్ నోయిడాలో భారీ అగ్నిప్రమాదం : 50 గుడిసెలు దగ్ధం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: గ్రేటర్ నోయిడాలో మంగళవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం జరిగింది. నోయిడాలోని కస్నా ప్రాంతంలోని మురికివాడలో మంటలు చెలరేగడంతో దాదాపు 50 గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి హుటాహుటిన అగ్నిమాపక యంత్రాలను తరలించారు.

అరడజనుకు పైగా వచ్చిన అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపులోకి తీసుకువచ్చామని అధికారులు పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఏమిటనేది ఇంకా నిర్ధారణ కాలేదని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం, ఎవరికీ గాయాలైన సమాచారం లేదని అధికారులు వెల్లడించారు.

భారత దేశ సంప్రదాయ వైద్యం గురించి తెలుసు : డబ్ల్యూహెచ్ఓ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19:: భారత దేశంలో సంప్రదాయ వైద్యం ఉన్నట్లు తనకు తెలుసునని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రెయెసస్ చెప్పారు. జామ్ నగర్‌లో డబ్ల్యూహెచ్ఓ అంతర్జాతీయ సంప్రదాయ వైద్య కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడారు. ఈ కేంద్రాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు.

ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు డబ్ల్యూహెచ్ఓ, భారత ప్రభుత్వం మార్చి 25న ఒప్పందం కుదుర్చుకున్నాయి. మంగళవారం ఈ కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఘెబ్రెయెసస్ మాట్లాడుతూ, భారత దేశంలోని సంప్రదాయ వైద్యం గురించి తాను తెలుసుకున్నానని తెలిపారు. తాను తన గురువులకు కృతజ్ఞుడినని చెప్పారు. తాను బాలీవుడ్ సినిమాలు చూస్తూ పెరిగానని తెలిపారు. బాలీవుడ్ ఫ్యాన్స్‌కు స్విస్ అల్ప్స్ చాలా ఇష్టమైన ప్రదేశమని చెప్పారు. సాక్ష్యాధారాలుగల సంప్రదాయ వైద్యాన్ని బలోపేతం చేయడానికి సైన్స్ శక్తిసామర్థ్యాలను ఉపయోగించుకోవడానికి ఈ కేంద్రం దోహదపడుతుందన్నారు. ఈ ముఖ్యమైన కార్యక్రమానికి సహకరిస్తున్నందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. తాత్కాలిక కార్యాలయంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి 250 మిలియన్ డాలర్లను సమకూర్చినందుకు, పదేళ్ళపాటు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తామని హామీ ఇచ్చినందుకు మోదీకి ధన్యవాదాలు చెప్పారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ, టెడ్రోస్ హిందీ, ఇంగ్లిష్, గుజరాతీ భాషల్లో మాట్లాడటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆయన ఈ విధంగా మూడు భాషల్లో మాట్లాడటం తమ హృదయాలకు హత్తుకుందని చెప్పారు.

అందరి సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం : మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ ఏప్రిల్ 19: : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని హెచ్‌బీ గార్డెన్, రోస్ గార్డెన్, కమల గార్డెన్‌లో ముస్లింలకు రంజాన్ కానుకలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టీఆర్ఎస్ సెక్యూలర్ ప్రభుత్వం అన్నారు. గత పాలకులు మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీలకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా మైనార్టీ గురుకులు పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసి మెరుగైన బోధన, వసతులు కల్పించినట్లు తెలిపారు. పాలమూరు అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, డీసీసీబీ చైర్మన్ నిజాం పాషా, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, టీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బండి సంజయ్ ప్రజా సంగ్రామ యాత్ర హాస్యాస్పదం : మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి ఏప్రిల్ 19: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర హాస్యాస్పదంగా ఉందనివిద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్న బీజేపీ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కందకూరు మండలంని మీర్‌ఖాన్‌పేట్ గ్రామంలో ఈ నెల 27న నిర్వహించే ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ.. మండల టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన పార్టీ సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని తెలిపారు. సంజయ్ చేస్తున్న యాత్ర ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఉద్యమ పార్టీ టీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు. ప్రధాన చౌరస్తాలో పార్టీ జెండాలను ఆవిష్కరించాలని సూచించారు. కేవలం 3వేల మందికే ఆహ్వానం ఉందని, మిగిలిన వారు గ్రామ గ్రామాన పార్టీ పండగలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

చరిత్రలో నేటినిజం



(ఏప్రిల్ 20 చంద్రబాబునాయుడు జననం..)

-రాధశ్రీ

సెల్: 9494481210

నగరంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 19: రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ నగరంలోని పాతబస్తీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు.

రూ.495కోట్ల విలువైన ఆరు పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. మీర్‌ఆలం చెరువు వద్ద మ్యూజికల్ ఫౌంటెన్‌ను కేటీఆర్ ప్రారంభించారు. అలాగే ఎస్‌టీపీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలాపత్తర్‌లో పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలను రూ.8వేల నుంచి రూ.17వేలకు పెంచినట్లు చెప్పారు. అలాగే రూ.108కోట్ల వ్యయంతో పూర్తి చేసిన బహదూర్‌పుర ఫ్లై ఓవర్, రూ.35కోట్లతో చార్మినార్ వద్ద మూర్గీచౌక్ పునరుద్ధరణ, రూ.30కోట్లతో సర్దార్ మహల్ అభివృద్ధి, రూ.297.30 కోట్లతో కార్వాన్ నియోజకవర్గంలో సీవరేజీ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమంలో హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాత బస్తీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 19: రాష్ట్రంలో మతం పేరిట ఎవరైనా చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తే ఉక్కుపాదంతో అణచివేస్తామని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. కులం, మతం పేరు మీద రాజకీయం చేసే విధ్వంసకర శక్తులను, చిల్లరమల్లర వ్యక్తులను ఒక కంట కనిపెట్టాల్సిన అవసరం ఉందని కేటీఆర్ సూచించారు.హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో రూ. 495 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్‌లోనే కాదు, రాష్ట్రంలో కూడా మతం పేరిట రాజకీయాలు చేయలేదు.. పనికిమాలిన పంచాయతీలు లేవు అని స్పష్టం చేశారు. కులాలు, మతాల పేరిట ప్రజల మధ్య చిచ్చు పెట్టలేదు. ఆ చిచ్చులో చలిమంటలు కాచుకునే ప్రయత్నం ఎప్పుడూ చేయలేదు.. చేయబోమని తేల్చిచెప్పారు. కొన్నేండ్ల క్రితం హైదరాబాద్‌లో ప్రతి ఏడాది ఐదు నుంచి పది రోజుల పాటు కర్ఫ్యూ విధించేవారు. కానీ కేసీఆర్ నాయకత్వంలో శాంతిభద్రతలను పటిష్టంగా కాపాడుకుంటున్నామని తెలిపారు. మతం పేరిట ఎవరైనా చిచ్చు పెట్టే ప్రయత్నం చేసినా ఉక్కుపాదంతో అణచివేస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు.

పాత బస్తీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఒకే ఒక్క రోజు రూ. 495 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించుకున్నామని కేటీఆర్ తెలిపారు. ఓల్డ్ సిటీ, న్యూ సిటీ అనే తేడా లేకుండా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గతంలో మోజాం జాహీ మార్కెట్‌ను చూసి బాధపడేవాళ్లం. ఇప్పుడు మోజాం జాహీ మార్కెట్‌ను అభివృద్ధి చేశామన్నారు. కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్‌కు పూర్వ వైభవం తీసుకువస్తాం. వారసత్వ సంపదను కాపాడుకుంటామని కేటీఆర్ పేర్కొన్నారు.

ఇప్పుడు ఏ ఎలక్షన్స్ లేవు. ఏ ఎన్నికలు లేకపోయినా.. రూ. 495 కోట్లతో ఇన్ని అద్భుతమైన కార్యక్రమాలు చేపట్టామంటే.. పాతబస్తీ అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కొన్ని మెట్రో నగరాల్లో తాగునీటికి కష్టాలు ఉన్నాయి. హైదరాబాద్‌లో మాత్రం తాగునీరు, విద్యుత్‌కు ఇబ్బంది లేదన్నారు. పాతబస్తీలో అవసరమైన చోట రోడ్లను విస్తరిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

నోటరీ సమస్యను పరిష్కరిస్తాం..

హైదరాబాద్‌లోని పాతబస్తీతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న నోటరీ సమస్యను పరిష్కారిస్తామని కేటీఆర్ తెలిపారు. జీవో నం 58, 59 తెచ్చి లక్ష మందికి హైదరాబాద్‌లో పట్టాలు ఇచ్చామని గుర్తు చేశారు. ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని అభివృద్ధి చేస్తున్నాం. పాలమూరు, నల్లగొండ, రంగారెడ్డి జిల్లా ప్రజలకు ఈ హాస్పిటల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లో ప్రభుత్వ వైద్య సదుపాయాలను పెంచుతున్నామని కేటీఆర్ తెలిపారు.

ప్రభుత్వ ఉదారత.. రోగి సహాయకులకూ రూ. 5 భోజనం

హైదరాబాద్, ఏప్రిల్ 19: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం తన ఉదార స్వభావాన్ని చాటుకుంది. రోగుల వెంట వచ్చే సహాయకులకు ఆయా ఆస్పత్రుల వద్ద షెల్టర్లు కట్టించాలని చెప్పిన సీఎం కేసీఆర్.. మరో గొప్ప నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ నగరానికి ఇతర జిల్లాల నుంచి మెరుగైన వైద్యం కోసం రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారు రోజుల తరబడి నగరంలోనే ఉండాల్సి వస్తుంది.

ఈ క్రమంలోనే రోగులకు, వారి సహాయకులకు ప్రభుత్వం ఉచితంగా నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించేందుకు ముందుకు వచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగి సహాయకులకు రూ. 5 భోజనం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ రాయితీ భోజనానికి ప్రభుత్వం ప్రతి ఏడాది రూ. 38.66 కోట్లు ఖర్చు చేయనుంది. దాదాపు 20 వేల మందికి ఈ భోజన సదుపాయం కలగనుంది.

ఈ క్రమంలో హైదరాబాద్‌లోని 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లోని రోగులకు, సహాయకులుగా వచ్చే వారికి ప్రభుత్వం రూ. 5 లకే నాణ్యమైన భోజనం అందించేందుకు హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ట్రస్ట్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పంద పత్రాలపై ప్రభుత్వం తరపున టీఎస్ఎంఎస్ఐడీసీ, హరే కృష్ణ మూమెంట్ సంస్థ కలిసి సంతకాలు చేశాయి.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు హైదరాబాద్‌లోని 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు, వారి సహాయకులకు మూడు పూటలా భోజనం పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాణ్యమైన భోజనం అందించే హరే కృష్ణ మూమెంట్ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రోగుల సహాయకులు రూ. 5 చెల్లిస్తే, మిగతా రూ. 21.25 లను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందిస్తామన్నారు. వారం పది రోజుల్లో భోజన సౌకర్యం అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను టీఎస్ఎంఎస్ఐడీసీ ఏర్పాటు చేయడం జరుగుతుంది.

వారం పది రోజుల్లో ఈ సౌకర్యాలు ఏర్పాటు చేసి, జంటనగరాల్లోని 18 ఆసుపత్రుల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వాములను చేసి ఒకే సారి ప్రారంభించడం జరుగుతుందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

జీహెచ్ఎంసీలో రూ. 5 లకే అన్నపూర్ణ కేంద్రాల ద్వారా ఇప్పటికే పేదలకు ఎలా భోజన సౌకర్యం అందుతుందో, అదేరీతిలో ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద ఈ సౌకర్య

నేల ఎడారీకరణతో వ్యవసాయ సంక్షోభం రానుందా...!

1960ల్లో నార్మన్ బోర్లాగ్ నాయకత్వంలో వచ్చిన హరిత విప్లవంతో వరి, గోధుమ లాంటి పొట్టి పంటలను ఏళ్ల తరబడి సాగుచేయడంతో నేలలు నిస్సారమై ఎడారీకరణకు బీజాలు పడ్డాయి. 1970ల్లో వచ్చిన స్వల్పకాలిక వరి వంగడాల సాగుతో దిగుబడులు పెరిగినా, నాణానికి మరో వైపున సారవంతమైన వ్యవసాయ నేలలు క్రమంగా నిస్సారమైన ఎడారులుగా మారే ప్రమాదపు అంచున ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యూపీ, పంజాబ్, బీహార్, పశ్చిమ బెంగాల్ లాంటి గంగా పరివాహక ప్రాంతాల్లో 5 మిలియన్ హెక్టార్ల వ్యవసాయ క్షేత్రాలు ఎడారీకరణకు చేరువలో ఉన్నాయని శాస్త్రజ్ఞులు సూచిస్తున్నారు. భూగోళంపై ఉన్న నేలలో 40 శాతం వరకు నీటి వసతులు లేని బీడు భూములే (డ్రై లాండ్స్) ఉన్నాయని, ఈ భూముల్లో 2 బిలియన్ల ప్రజలు జీవిస్తున్నారని అంచనా. ప్రపంచవ్యాప్తంగా 12 మిలియన్ ఘనపు కిలోమీటర్ల శుష్క భూములు (అరీడ్ లాండ్స్) ఎడారీకరణకు లోనైనాయని, దాదాపు 20 శాతం బీడు భూములు క్షీణత(డీగ్రెడేషన్)కు గురి అయ్యాయని గణాంకాలు వివరిస్తున్నాయి. భూగోళంపై ఉన్న 20 శాతం నేలల్లో సగం వరకు ఎడారీకరణ ప్రమాదపు అంచున ఉన్నాయని, ప్రతి ఏటా 12 మిలియన్ హెక్టార్ల సారవంతమైన నేల ఎడారీకరణ ఉచ్చులో పడుతున్నదని తేలింది. ఈ అవాంఛనీయ సంక్షోభ ఫలితంగా 3 బిలియన్ల ప్రజలు ఆహార కొరతతో పేదరికంలోకి నెట్టబడడం జరుగుతున్నది. ఈ దుష్పరిణామాల వల్ల ఒక బిలియన్ ప్రజల ఆకలి చావులు పెరుగుతాయని పేర్కొనబడింది.

సహజ విపత్తులు లేదా మానవ కృత్రిమ కార్యాల వల్ల సారవంతమైన నేల నిర్వీర్యం, నిస్సారం కావడాన్ని ఎడారీకరణగా పేర్కొంటారు. ఈ నేలలకు పోషకాలను అందిస్తూ, వెంటనే సారాన్ని అందించని యెడల వ్యవసాయ యోగ్యతను కోల్పోయి, వ్యవసాయ వినియోగానికి పనికి రాకుండా శుష్క భూములుగా మారిపోతాయని గమనించాలి. సకాలంలో స్పందించని యెడల కొంత కాలానికి నేల నాణ్యత నశించి, క్రమంగా వ్యవసాయ దిగుబడులు పూర్తిగా తగ్గి, శాశ్వతంగా కోలుకోలేని దుస్థితికి చేరుతూ ఎడారులను తలపిస్తాయి. నేలను అత్యాశతో సాగుకు వాడితే పర్యావరణ కాలుష్యం, వాతావరణ ప్రతికూల మార్పులు, జీవ వైవిధ్య వినాశనం, అంటువ్యాధులు ప్రబలడం జరుగుతాయి. దీని పర్యవసానంగా నీటి కొరత, జీవన భృతి, ప్రకృతి విపత్తులు కూడా చూడవచ్చు. వెంటనే మానవ సమాజం మేల్కొని ఎడారీకరణకు అడ్డుకట్టవేయని యెడల రాబోయే 25 ఏండ్లలో 12 శాతం ఆహార ఉత్పత్తి పడిపోయి, 30 శాతం ఆహార ఉత్పత్తుల ధరలు పెరగడం, పేదరికం పెరగడం జరిగి, ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అధిగమించడం వీలుకాని దుస్థితి వస్తుందని గమనించాలి. 2030 వరకు 350 మిలియన్ హెక్టార్ల నిస్సార ఎడారి భూముల నాణ్యతను పునర్ ప్రతిష్టాపన చేయడంతో దాదాపు 26 గిగా టన్నుల గ్రీన్‌హౌజ్ వాయువులు వాతావరణలోంచి తొలగించబడుతాయని అంచనా వేస్తున్నారు. ఎడారీరకణను కట్టడి చేయడంతో వ్యవసాయ ఉపాధులు, అనుబంధ పరిశ్రమలు, పోషకాహార లభ్యత, నీటి లభ్యత, జీవ వైవిధ్య పరిరక్షణ పెరిగి వాతావరణంలో సకారాత్మక మార్పులకు పునాది పడుతుంది.

కృత్రిమ ఎరువులు అధికంగా వాడడం , విచక్షణారహిత రసాయనాల వాడకం, అధిక నీటి వినియోగంతో దిగుబడులు పెరిగి ఆహార భద్రత సుసాధ్యమైనప్పటికీ ఏకకాలంలో ఎడారీకరణ కూడా పెరగడం విచారకరం. నేలలోని సారాన్ని అనేక ఏండ్లుగా దురాశతో లాగుతూ, దిగుబడులను పెంచుకునే ప్రయత్నాలలో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడడంతో నేలలోని హిత సూక్ష్మజీవులు, ఇతర జీవులు నశించడంతో సారవంతమైన నేలలు క్రమంగా నిస్సారమై ఎడారీకరణకు చేరువ కావడం చూస్తుండగానే జరిగిపోయింది. నేల ఎడారీకరణ, నేల కోత, నేల నాణ్యతలో క్షీణతలు కాలక్రమంలో జరగడం వాస్తవ అనుభవంగా గుర్తిస్తున్నాం. అడవుల నరికి వేత, పచ్చిక బయళ్లు / చెట్టు చేమల్ని తొలగించడం, పశుగ్రాస వినియోగం, వ్యవసాయ క్షేత్రాల విస్తరణ, రోడ్ల నిర్మాణం, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ లాంటి మానవ ఆధునిక క్రియలు ఎడారీకరణను అనేక రెట్లు పెంచడం జరిగింది. అత్యాధునిక యంత్రాల వినియోగం, ఒకే రకమైన పంటలు వేయడం, నేల నాణ్యతను అతిగా పీల్చడం, నేల కాలుష్యం లాంటి కారణాలతో నాణ్యమైన నేలలు నిస్సారమై ఎడారులను తలపించుట ప్రారంభమైంది. ఆహార వ్యర్థాలను తగ్గించడంతో పాటు పంట మార్పిడి పద్ధతులు, పరిమిత పట్టణీకరణ, విచక్షణాయుత ఎరువులు/ పురుగు మందులు వాడకం లాంటి అనేక చర్యలు ఎడారీకరణను అడ్డుకుంటాయి. సారవంతమైన నేలలు మానవాళి ఉనికికి ప్రతిరూపాలని తెలుసుకొంటూ, గ్రీన్‌హౌజ్ వాయువులను నియంత్రిణ చేయడమే కాకుండా మె?క్కలు, జంతువులు మరియు మానవాళిని సుసంపన్నం చేయడానికి ఎడారీకరణకు ఆనకట్ట వేయబడుతుంది. మానవ కనీస అవసరాలైన కూడు, గుడ్డ మరియు గూడులను అందించుటలో సారవంతమైన నేలలు ప్రధాన భూమికను నిర్వహిస్తున్నాయని, నేల సారాన్ని కాపాడడమంటే జీవన ప్రమాణాలను పెంచుకోవడమే అని భావిద్దాం. నాణ్యమైన మట్టి సువాసనను ఆశ్వీవాదిస్తూ, పిడికిళ్లోకి తీసుకొని ముద్దాడుదాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

చంద్రబాబును సీఎం చేశాక రాజకీయాల నుంచి తప్పుకుంటా : జేసీ ప్రభాకర్ రెడ్డి

అమరావతి, ఏప్రిల్ 19:తాడిపత్రి మున్సిపల్ చైర్మెన్ జేసీ ప్రభాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు. అనంతపురంలో చంద్ర దండు రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్ నాయుడిని కలిసిన జేసీ ప్రభాకర్ రెడ్డి అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబును సీఎం చేశాక రాజకీయాల నుంచి తప్పుకుంటానని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాయుడు సీఎం అయితేనే ప్రజలకు శాంతి, సంక్షేమ పాలన అందుతాయని ఆయన చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రజా సమస్యలపై ఉద్యమిస్తే రౌడీషీట్లు తెరుస్తున్నారని, ఈ తీరు సరికాదని విమర్శించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉష శ్రీ చరణ్ చేసిన విమర్శలకు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి మంగళవారం నాడు కౌంటరిచ్చారు. శవ రాజకీయాలు చేసేది జఅఖ వాళ్లేనని చెప్పారు. తాడిపీత్రికి వచ్చి తనపై విమర్శలు చేయడం వల్ల ఏం ఉపయోగమని జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. చనిపోయిన పాప తండ్రి వికలాంగుడని ఆయన గుర్తు చేశారు. పాప తండ్రికి పెన్షన్ ఇప్పించాలని మంత్రిని కోరాడు అలా పెన్షన్ ఇప్పిస్తే నీ ఇంటికి వచ్చి సన్మానం చేస్తానని జేసీ ప్రభాకర్ రెడ్డి చెప్పారు. గతంలో ఏ పార్టీలో ఉన్నావో ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలని కూడా జేసీ ప్రభాకర్ రెడ్డి మంత్రిని కోరారు.

ఇండోనేషియాలో భూకంపం - 6.0 తీవ్రత - సునామీ హెచ్చరికలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19:ఇండోనేషియాని వరుస భూకంపాలు వణికిస్తున్నాయి. ఈ నెలలోనే అంటే ఏప్రిల్ లోనే దాదాపు నాలుగుసార్లు భూకంపాలు రావడం గమనార్హం. కాగా నేడు ఉదయం 6.0 తీవ్రతతో భూకంపం సంభవించడంతో ఇండోనేషియా వాతావరణ శాఖ సునామీ హెచ్చరిక జారీ చేసింది. తీర ప్రాంతాల్లో నివసించే జనం ఇండ్లను ఖాళీ చేయాలని సూచించింది. ఉదయం 6.73 గంటల ప్రాంతంలో రిక్టర్ స్కేల్‌పై 6.0 తీవ్రతతో బలమైన ప్రకంపనలు రికార్డయ్యాయని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ తెలిపింది. సులవేసి కొటమోబాగుకు 779 కిలోమీటర్ల దూరంలో, భూమికి 50 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం గుర్తించినట్లు పేర్కొంది. అయితే, ఇప్పటి వరకు నష్టంకు సంబంధించిన వివరాలు అందలేదని అధికారులు తెలిపారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై చర్చ జరుగాలి : స్పీకర్ పోచారం

నిజామాబాద్, ఏప్రిల్ 19: వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక పద్ధతులు, అధిక లాభాలను అందించే పంటలపై చర్చ జరగాలని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కోటగిరి మండలం పోతంగల్ గ్రామంలో రూ.14 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు.

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ..వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ సాగు చేస్తే రైతులకు మంచి లాభాలు వస్తాయన్నారు. దేశంలో అతిపెద్ద కుటుంబం రైతు కుటుంబం. 70 శాతం కుటుంబాలు రైతులవే. రైతులకు ఉపయోగపడటానికి రాష్ట్ర వ్యాప్తంగా 2,600 రైతు వేదికలను నిర్మించామన్నారు. రైతు వేదికలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్ట్రం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేనితనం బండి సంజయ్‌ది

జనగామ, ఏప్రిల్ 19: : తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బీజేపీ నేత కేంద్రంతో వడ్లు కొనిస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పుడు మాట మారుస్తున్నాడు.. బండి సంజయ్ కాదు..తొండి సంజయ్ అని, ఆయన మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఎద్దేవా చేశారు. మంగళవారం జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ మండలం తాటికొండ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ రాష్ట్రం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేనితనంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం మీద కక్ష కట్టిందన్నారు..బిజెపి ప్రభుత్వం యాసంగిలో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చెయ్యమని చెపుతున్న దృష్ట్యా వరి ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల11వ తేదీన తెలంగాణ రాష్ట్ర రైతుల పక్షాన రాజధాని ఢిల్లీ నడిబొడ్డున ధర్నా చేయడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని, కావున రైతులు ఎవ్వరూ ఆధైర్య పడవద్దని రైతులకు భరోసా కల్పించారు..ఈ కార్యక్రమంలో ఎంపీపీ కందుల రేఖ, జడ్పిటిసి రవి, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, సర్పంచ్ చల్లా ఉమాదేవి, జిల్లా నాయకులు అక్కనపల్లి బాలరాజు, పిఎసిస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని నిర్వహించిన ఏఎస్ఐ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19:ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ రాష్ట్రవ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహించింది. గత చరిత్రను గుర్తుచేసుకుంటూ వారసత్వాన్ని పరిరక్షించడం మరియు సంరక్షించే అంశాలపై అవగాహన పెంపొందించాలన్న లక్ష్యంతో ఏటా ఏప్రిల్ 18న ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతూ వస్తోంది.ప్రపంచ వారసత్వ దినోత్సవంలో భాగంగా ప్రపంచ వారసత్వ సంపదగా గత ఏడాది యునెస్కో గుర్తించి ప్రకటించిన రామప్ప దేవాలయం వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఏఎస్ఐ వరంగల్ సబ్ సర్కిల్, హైదరాబాద్ సర్కిల్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కలెక్టర్ శ్రీ కృష్ణ ఆదిత్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దాదాపు 800 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతనమైన, రామప్ప దేవాలయాన్ని రుద్రేశ్వర దేవాలయం అని కూడా పిలుస్తారు, కాకతీయ పాలకులు దేవాలయాన్ని నిర్మించారు. ప్రధాన వాస్తుశిల్పి రామప్ప పేరు మీద ఈ దేవాలయం రామప్ప దేవాలయం ప్రాచుర్యం పొందింది. వాస్తు శిల్పి పేరిట దేశంలో ప్రాచుర్యం పొందిన ఏకైక దేవాలయం రామప్ప దేవాలయం ఒక్కటే.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (పిఎస్‌టియు)లో తెలంగాణ పురావస్తు, సంస్కృతి, వారసత్వం అనే అంశంపై విద్యాపరమైన సదస్సులు జరిగాయి. ఉదయం జరిగిన సదస్సుకు ఏఎస్ఐ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ డాక్టర్ స్మిత ఎస్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ స్మిత ఎస్ కుమార్ ఈ కార్యక్రమాల వల్ల ప్రజల్లో అవగాహన పెంపొందించి స్మారక చిహ్నాలను సంరక్షించి భావితరాలకు వాటిని అందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు లక్ష్యాల మేరకు అమలు జరుగుతాయని అన్నారు.ప్రారంభోత్సవం అనంతరం పీటీఎస్‌యూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భట్టు రమేష్ 'డెక్కన్ ఫిరంగులు– నిర్లక్ష్యానికి గురైన అందాలు' అనే అంశంపై రూపొందించిన పత్రాన్ని డాక్టర్ ఎస్ జై కిషన్ సమర్పించారు. సదస్సుకు పీటీఎస్‌యూ, నిజాం కళాశాల, భవన్ కళాశాల విద్యార్థులు, ఓయూ ఆర్కియాలజీ విభాగం విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పారిస్‌లోని అంతర్జాతీయ స్మారక చిహ్నాలు మరియు ప్రాంతాల మండలి చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా ఏప్రిల్ 18వ తేదీని ప్రపంచ వారసత్వ దినోత్సవంగా నిర్వహించాలని యునెస్కో నిర్ణయించింది. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఏఎస్ఐ ఈరోజు అనేక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది.

భారతదేశ సైబర్ విధానాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వ అధికారులు మరియు క్రిటికల్ సెక్టార్ సంస్థల కోసం నేషనల్ సైబర్ సెక్యూరిటీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19:జాతీయ భద్రతా సలహాదారు శ్రీ అజిత్ దోవల్, కేసీ, ఈ రోజు నేషనల్ సైబర్ సెక్యూరిటీ ఇన్సిడెంట్ రెస్పాన్స్ ఎక్సర్‌సైజ్‌ని నేషనల్ సైబర్ సెక్యూరిటీ కోఆర్డినేటర్ లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పంత్ మరియు డీఆర్‌డీవో సెక్రటరీ డాక్టర్ సతీష్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. నేషనల్ సైబర్ ఎక్సర్‌సైజ్ (ఎన్‌సిఎక్స్) ఇండియా సమకాలీన సైబర్ దాడులు మరియు నిర్వహణపై ప్రభుత్వ/క్లిష్ట రంగ సంస్థలు మరియు ఏజెన్సీల సీనియర్ మేనేజ్‌మెంట్ మరియు టెక్నికల్ సిబ్బందికి శిక్షణనిచ్చే లక్ష్యంతో 2022 ఏప్రిల్ 18 నుండి 29 వరకు పది రోజుల పాటు హైబ్రిడ్ వ్యాయామంగా నిర్వహించబడుతుంది.

ఈ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ (ఎన్ఎస్‌సిఎస్)నిర్వహిస్తోంది. నాలెడ్జ్ పార్టనర్‌గా డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డిఎస్‌సిఐ) సహకారంతో భారతదేశరక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ) మద్దతు ఉంది. శిక్షణ కోసం ప్లాట్‌ఫారమ్‌ను సైబర్‌ఎక్సర్ టెక్నాలజీన్ అందిస్తోంది. ఇది ప్రపంచవ్యాప్తంగా అనేక పెద్ద సైబర్ వ్యాయామాలను నిర్వహించడం కోసం గుర్తింపు పొందిన ఎస్టోనియన్ సైబర్‌సెక్యూరిటీ కంపెనీ.

140 మందికి పైగా అధికారులు శిక్షణా సెషన్‌లు, లైవ్ ఫైర్ మరియు స్ట్రాటజిక్ వ్యాయామాల ద్వారా శిక్షణ పొందుతారు. ఇన్‌ట్రూషన్ డిటెక్షన్స్, మాల్వేర్ ఇన్వర్జేషన్ షేరింగ్ ప్లాట్‌ఫారమ్ (ఎంఏఎస్‌పి), వల్నరబిలిటీ హ్యాండ్లింగ్ ఉ పెనెట్రేషన్ టెస్టింగ్, నెట్‌వర్క్ ప్రోటోకాల్స్ ఉ డేటా ఫ్లోస్, డిజిటల్ ఫోరెన్సిక్స్ మొదలైన అనేక కీలకమైన సైబర్ సెక్యూరిటీ విభాగాలపై ఇందులో పాల్గొన్న వారికి శిక్షణ ఇవ్వబడుతుంది.

సైబర్ బెదిరింపులను బాగా అర్థం చేసుకోవడానికి, సంసిద్ధతను అంచనా వేయడానికి మరియు సైబర్ సంక్షోభ నిర్వహణ మరియు సహకారం కోసం నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఎన్‌సిఎక్స్ ఇండియా వ్యూహాత్మక నాయకులకు సహాయం చేస్తుంది.

ఇది సైబర్ సెక్యూరిటీ స్కిల్స్, టీమ్‌వర్క్, ప్లానింగ్, కమ్యూనికేషన్, క్రిటికల్ థింకింగ్ మరియు డెసిషన్ మేకింగ్‌లను అభివృద్ధి చేయడంలో మరియు పరీక్షించడంలో కూడా సహాయపడుతుంది.

జాతీయ భద్రతా సలహాదారు శ్రీ అజిత్ దోవల్, కేసీ, తన ప్రధాన ప్రసంగంలో దేశంలో జరుగుతున్న డిజిటల్ విప్లవాన్ని మరియు ప్రభుత్వం పెద్ద సంఖ్యలో డిజిటల్ సేవలను ప్రారంభించడాన్ని హైలైట్ చేశారు. ఏదైనా విజయవంతమైన డిజిటల్ పరివర్తనకు సైబర్ భద్రత పునాది అని ఆయన అన్నారు. సైబర్‌స్పేస్‌లో ఏవైనా బెదిరింపులు నేరుగా మన సామాజిక, ఆర్థిక మరియు జాతీయ భద్రతపై ప్రభావం చూపుతాయి కాబట్టి మనం మన సైబర్‌స్పేస్‌ను కాపాడుకోవాలన్నారు.

నేషనల్ సైబర్ సెక్యూరిటీ కోఆర్డినేటర్ లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పంత్, భారతీయ సైబర్‌స్పేస్ యొక్క ప్రాముఖ్యతను మరియు పౌరులు, వ్యాపారాలు మరియు ప్రభుత్వాల కోసం దానిని సురక్షితంగా మరియు క్షేమంగా ఉంచవలసిన అవసరాన్ని తెలియజేశారు. ప్రపంచంతో పాటు మన దేశంలో జరుగుతున్న రాన్సమ్‌వేర్ మరియు సప్లై చైన్ దాడుల పెరుగుదల గురించి మరియు ఈ దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అన్ని సంస్థల మధ్య సమన్వయాన్ని సాధించడం ఎలా చాలా ముఖ్యమైనది అని ఆయన మాట్లాడారు. ఆయిల్ ఇండియా లిమిటెడ్‌పై ఇటీవల జరిగిన రాన్సమ్‌వేర్ దాడిని మరియు ప్రపంచ దృష్టాంతంలో సైబర్ వార్‌ఫేర్ యొక్క ప్రాముఖ్యతను కూడా ఆయన హైలైట్ చేశారు. సైబర్ సెక్యూరిటీలో సామర్థ్యాలను పెంపొందించడానికి మరియు నైపుణ్యాలను పెంపొందించడానికి భారత ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది.

మనిషికైనా, మొక్కకైనా మట్టే ప్రాణాధారం : ఎంపీ సంతోష్

హైదరాబాద్, ఏప్రిల్ 19:కోయంబత్తూరులోని ప్రఖ్యాత ఈశా ఫౌండేషన్ ప్రతినిధులు రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ ను హైదరాబాద్ లో కలిశారు. సద్గురు ఆధ్వర్యంలో చేపట్టిన " సేవ్ సాయిల్" ఉద్యమానికి మద్దతివ్వాలని ఈశా ఫౌండేషన్ ప్రతినిధులు ప్రసాద్, శైలజ, రాఘవ తదితరులు ఎంపీ సంతోష్ కుమార్ ను కోరారు. ఈ సందర్భంగా ఎంపీ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. పుడమి పచ్చదనం పెంచడమే లక్ష్యంగా "హరా హైతో భరా హై" అనే గొప్ప నినాదంతో 17 జూలై 2018న తాము ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఉద్యమం నేడు హరిత కార్యక్రమాల్లో గొప్ప విప్లవంగా మారి, అనుకున్న లక్ష్యాన్ని చేరిందని ఈశా ఫౌండేషన్ సభ్యులకు వివరించారు. మట్టికి ? మొక్కకు అవినాభావ సంబంధం ఉన్నట్లే ఈశా ఫౌండేషన్ చేపట్టిన సేవ్ సాయిల్ ఉద్యమానికి, తాము చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఉద్యమానికి కూడా అదే సంబంధం ఉంటుందని ఎంపీ సంతోష్ అన్నారు. అందుకే " మట్టిని కాపాడుకుందాం ? మొక్కను బతికించుకుందాం" అని ఆయన అన్నారు. సేవ్ సాయిల్ ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఈశా ఫౌండేషన్ చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలను ఎంపీ సంతోష్ కు ఈశా ప్రతినిధులు తెలియజేశారు. సద్గురు ఆధ్వర్యంలో సేవ్ సాయిల్ ఉద్యమాన్ని చేపట్టి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పర్యటనలను విజయవంతమయ్యాయని, ప్రస్తుతం ప్రపంచ యాత్ర జరుగుతున్న దన్నారు. ఆ యాత్రా విశేషాలను ఎంపీ సంతోష్ కు వివరించారు. అలాగే, త్వరలోనే హైదరాబాద్ లోని గచ్చిబౌలిలో ఈశా ఫౌండేషన్ ఏర్పాటు చేయబోయే సేవ్ సాయిల్ ఉద్యమ కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపీ సంతోష్ కుమార్ ను ఈశా ఫౌండేషన్ ప్రతినిధులు ఆహ్వానించగా, సానుకూలంగా స్పందించిన ఎంపీ సంతోష్ కుమార్ తప్పక హాజరవుతానని, సేవ్ ఆయిల్ ఉద్యమానికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

జూబ్లీహిల్స్ డివిజన్‌లో రూ.3కోట్లతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే దానం

హైదరాబాద్, ఏప్రిల్ 19:జూబ్లీహిల్స్ డివిజన్‌లో మురుగు సమస్యలు పరిష్కరించడంతో పాటు మంచినీటి సమస్యలు తీర్చేందుకు రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఫిలింనగర్ 18 బస్తీల్లో చేపట్టిన డ్రైనేజీ లైన్ పనులను మంగళవారం ఎమ్మెల్యే దానం నాగేందర్ పరిశీలించారు. భగత్‌సింగ్ కాలనీ, దుర్గాభవానీనగర్, గౌతమ్‌నగర్ తదితర బస్తీల్లో పనులు కొనసాగుతున్న తీరును ఎమ్మెల్యే పరిశీలించడంతో పాటు త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ 18 బస్తీల్లో సమస్యల పరిష్కారానికి రూ.98లక్షలతో పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు. ఈ పనులు పూర్తయిన వెంటనే జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సీసీ రోడ్డుపనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

డివిజన్ పరిధిలో జలమండలి ఆధ్వర్యంలోనే రూ.3కోట్లు ఖర్చుచేసి కొత్త డ్రైనేజీలైన్లను, మంచినీటి లైన్లను వేస్తున్నామన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మరో రూ.3కోట్లతో వీడీసీసీ రోడ్డుపనులు చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీఆర్ఎస్ నాయకులు మామిడి నర్సింగరావు, నగేష్ సాగర్, సంపంగి కిరణ్, నక్కా రాము, నాని, తదితరులు పాల్గొన్నారు.

మనీ ల్యాండరింగ్, టెర్రర్ ఫైనాన్సింగ్.. క్రిప్టోలతో అదే డేంజర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: క్రిప్టోలకు క్రేజీ పెరుగుతున్న విషయం తెలిసిందే. అయితే క్రిప్టోల వల్ల కలిగే దుష్ ప్రభావాలపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఓ కామెంట్ చేశారు.

డిజిటల్ కరెన్సీ వల్ల మనీల్యాండరింగ్, టెర్రర్ ఫైనాన్సింగ్ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్‌లో జరిగిన సెమినార్‌లో మంత్రి మాట్లాడారు. క్రిప్టో కరెన్సీ ద్వారా ఉండే అతి పెద్ద రిస్క్ మనీ ల్యాండరింగ్, ఉగ్రవాద సంస్థల లావాదేవీలే అని ఆమె అన్నారు. టెక్నాలజీతో నియంత్రణ చేయాలని, కానీ నియంత్రణ కోల్పోతే ఆ దేశానికి సమస్య అవుతుందని మంత్రి అన్నారు. ఐఎంఎఫ్ డైరక్టర్ క్రిస్టలీనా జార్జీవా నేతృత్వంలో జరిగిన ఉన్నత స్థాయి ప్యానెల్ డిస్కషన్‌లో మంత్రి పాల్గొన్నారు. భారత్‌లో కోవిడ్ వేళ డిజిటల్ లావాదేవీలపై ఆధారపడ్డ వారి సంఖ్య గణనీయంగా పెరిగినట్లు సీతారామన్ చెప్పారు. డిజిటల్ లావాదేవీలను భారతీయులు త్వరగా దత్తత తీసుకున్నట్లు ఆమె తెలిపారు. దానికి సంబంధించిన డేటాను కూడా ఆమె ప్రజెంట్ చేశారు. ఏప్రిల్ 24వ తేదీన శాన్ ఫ్రాన్సిస్‌కోలో వ్యాపారవేత్తలతో మంత్రి సీతారామన్ చర్చించనున్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయాలి..



యాదాద్రి, ఏప్రిల్ 19:: రాజాపేట మండలంలోని కుర్రారం, జాల.పాముకుంట గ్రామలలోని సుమారు 90 ఎకారల భూమి ఆక్రమ రిజిస్టేషన్ జరిగాయని, వెంటనే రద్దు చేయాలని కోరుతూ మంగళవారం రాజాపేట తహసీల్దార్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న దీక్ష రెండవ రోజు కొనసాగుతుంది. తమ భూములను తమకు దక్కే విధంగా,మా తాతా తండ్రులు మరణిస్తే వారి పేర్ల నుండి మాపేర్ల పై ఎలాంటి పౌతి మార్పిడిలు సాదాబై నామ ద్వారా 13 బీ సర్టిఫికెట్, అమెండ్మెంటు లేకుండా వారి పేరు మీద ఉన్న భూములు అక్రమాదారులు రిజిస్టేషన్ చేసుకున్నారని, భూ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. రైతుల పట్టే దారుల భూములను అన్యాక్రాంతం చేస్తూ హద్దులు పొంతనలేని సర్వేనెంబర్ లకు అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేసారు.

అక్రమ రిజిస్ట్రేషన్లను కలెక్

కొవిడ్-19పై పోరాడుతున్న ఆరోగ్య కార్యకర్తలకు బీమా పథకం మరో 180 రోజుల పాటు పొడిగింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19:కొవిడ్-19పై పోరాటం చేస్తున్న ఆరోగ్య సిబ్బంది కోసం తీసుకొచ్చిన 'ప్రధానమంత్రి గరిబ్ కల్యాణ్ ప్యాకేజీ (పీఎంజీకేపీ) బీమా పథకాన్ని' మరో 180 రోజుల పాటు పొడిగించారు. ఇవాళ్లి నుంచి (19 ఏప్రిల్, 2022) నుంచి ఈ పొడిగింపు అమల్లోకి వస్తుంది. కొవిడ్ రోగుల సంరక్షణ కోసం నియమించిన ఆరోగ్య సిబ్బంది మీద ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసాను మరింత కాలం పెంచడానికి ఈ పథకాన్ని పొడిగించారు.

ఈ పొడిగింపు గురించి అన్ని రాష్ట్రాలు/యూటీల్లోని ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించడం కోసం, ఆయా రాష్ట్రాలు/యూటీల అదనపు ప్రధాన కార్యదర్శులు (ఆరోగ్యం)/ ముఖ్య కార్యదర్శులు (ఆరోగ్యం)/ కార్యదర్శులకు (ఆరోగ్యం) ఇవాళ ఒక లేఖను పంపారు. 2020 మార్చి 30వ తేదీన పీఎంజీకేపీని ప్రారంభించారు. తాము కొవిడ్ బారిన పడే ప్రమాదం ఉన్నా వెరవకుండా, కొవిడ్ రోగులకు చికిత్స చేస్తున్న సామాజిక ఆరోగ్య కార్యకర్తలు సహా ఆరోగ్య సంరక్షణ సిబ్బందికి సమగ్ర వ్యక్తిగత ప్రమాద కవరేజీని అందించడానికి ఈ పథకాన్ని ప్రారంభించారు. మొత్తం 22.12 లక్షల మంది సిబ్బందికి, ఒక్కొక్కరికి రూ.50 లక్షల బీమా కవరేజీ కల్పించారు.

ప్రైవేట్ ఆస్తుపత్రుల సిబ్బంది, రాష్ట్రాలు, కేంద్ర ఆసుపత్రులు/ కేంద్ర, రాష్ట్ర, యూటీల స్వయంప్రతిపత్త ఆసుపత్రులు/ ఎయిమ్స్ ఉ జాతీయ ప్రాధాన్యత సంస్థ (ఐఎన్ఐ)/ కొవిడ్-19 రోగుల సంరక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్ర మంత్రిత్వ శాఖల ఆసుపత్రుల్లో కొవిడ్ విధుల్లో ఉన్న విశ్రాంత/ స్వచ్ఛంద/ స్థానిక పట్టణ సంస్థల/ ఒప్పంద / రోజువారీ వేతన/ అడ్‌హక్/ ఔట్‌సోర్స్ సిబ్బంది కూడా కూడా పీఎంజేకేపీ పరిధిలోకి వస్తారు.ఈ పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు, కొవిడ్ సంబంధిత విధుల్లో ఉంటూ మరణించిన ఆరోగ్య సిబ్బందికి సంబంధించిన 1905 క్లెయిములను పరిష్కరించారు.

మరో 4 రోజులపాటు దంచికొట్టనున్న ఎండలు.. ఆ జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 19: రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. మండుటెండలకు జనాలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్ నగరంలో అయితే మంగళవారం మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టాయి. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. అయితే రాబోయే రెండు రోజుల పాటు నగరంలో భారీగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

మంగళవారం మధ్యాహ్నం వరకు ఎల్బీనగర్‌లో అత్యధికంగా 40.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ వెల్లడించింది. అత్యల్పంగా మేడ్చల్ జిల్లా పరిధిలోని మౌలాఅలీలో 23.08 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

రాబోయే నాలుగు రోజుల పాటు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, రాజన్న సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల్లో భారీగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. 40 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ రెండు జిల్లాల్లో 36 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ఉదయం 10 గంటల తర్వాత బయటకు వెళ్లకపోవడం మంచిదని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. ఎండలు మండిపోతున్న నేపథ్యంలో కొబ్బరి నీళ్లు, చెరుకు రసం, మజ్జిగతో పాటు వాటర్ మెలన్ తీసుకుంటే మంచిదని పేర్కొన్నారు.

ఉద్యోగార్థులు జిల్లా లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి.....!

– రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు.

సంగారెడ్డి, ఏప్రిల్ 19 (నేటి నిజం ప్రతినిధి) వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ కోసం ప్రభుత్వం భారీ ఎత్తున ఉద్యోగ నోటిఫికేషన్ లను వెలువరించనున్న నేపథ్యంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి హరీష్ రావు సూచించారు.

సోమవారం ఆయన జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన ఉచిత భోజన క్యాంపును ప్రారంభించారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. లైబ్రరీలో సరిపడా ఫర్నిచర్, విశాలమైన రీడింగ్ రూమ్స్, అన్ని రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు ఉండడం, చక్కటి వాతావరణంలో కొనసాగుతుండడం చూసి మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. చక్కటి వసతులతో కూడుకుని ఉన్న ఈ లైబ్రరీని అభ్యర్థులు పెద్ద సంఖ్యలో వినియోగించుకోవాలని సూచించారు.

ప్రశాంత వాతావరణంలో ఏకాగ్రతతో చదువుకునేందుకు వీలుగా గ్రంథాలయంలో అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. పోటీ పరీక్షలకు ఉపయుక్తంగా నిలిచే అన్ని రకాల స్టడీ మెటీరియల్స్, పుస్తకాలు లైబ్రరీలో ఉన్నాయన్నారు. ఉద్యోగ, పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు ఇక్కడి లైబ్రరీ లో ఉచిత మధ్యాహ్న భోజన వసతిని ఏర్పాటు చేయడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. అభ్యర్థులకు ఆకలి తీరితే చదువు పై మనసు నిమగ్నం అవుతుందన్నారు.

ఈ సందర్భంగా గ్రంథాలయంలో రోజుకు 300 మందికి ఉచిత భోజన అందించనున్నట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ నరహరి రెడ్డి మంత్రి తెలిపారు.

ఉచిత భోజన క్యాంపు ప్రారంభించిన మంత్రి విద్యార్థులకు, భోజనాన్ని వడ్డించారు.

అంతకుముందు జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రాన్ని, సీవీ రామన్ సైన్స్ మ్యూజియంను మంత్రి ప్రారంభించారు.

సైన్స్ మ్యూజియం వివరాలు

పదిసార్లు చదివేకంటే ఒక్కసారి చూస్తే ఎక్కువ అర్థం అవుతుంది.

–ఇక కొన్ని సైన్స్ ప్రయోగాలైతే ఎన్నిసార్లు చదివినా అర్థం కావు.

–కానీ వాటిని కళ్లకు కట్టినట్టు చూపిస్తే.. అందులోని మర్మలాను విద్యార్థులు తమ మస్తిష్కాల్లో నిక్షిప్తం చేసుకుంటారు.

–విద్యార్థులకు సైన్స్ పట్ల భయం పొగోట్టి వారికి ఆసక్తి పెంచేలా ఈ విన్నూత్న ప్రయత్నం చేశారు.

– విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టుల పట్ల భయం రోజురోజుకూ భయం ఎక్కువ అవుతోంది.

–అందులోని సిద్ధాంతాలు, ప్రయోగాలు అర్థంకాక ఆ సబ్జెక్టుల పట్ల నిరాశక్తి చూపిస్తున్నారు.

–దీనిని గుర్తించిన సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారులు ఆరు సంవత్సరాల క్రితం జిల్లా సైన్స్ కేంద్రం పేరుతో ఓ ప్రయత్నం మొదలు పెట్టారు.

–ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు వారి పాఠ్యపుస్తకాల్లో ఉన్న వందలాది ప్రయోగాల నమూనాలు తయారు చేశారు.

–సైన్స్ సెంటర్ కు వచ్చిన విద్యార్థులే స్వయంగా ప్రయోగాలు చేసి అందులోని మర్మాలను తెలుసుకున్నారు.

– సైన్స్ సెంటర్ ప్రయత్నం సత్ఫలితాలు అవ్వడంతో.. మరో అడుగు వేశారు.

–అదే సైన్స్ మ్యూజియం. విజ్ఞానంతో వినోదం పంచాలన్న ఉద్దేశంతో దీన్ని నిర్మించారు.

–బిర్లా సైన్స్ మ్యూజియం సహకారంతో రాష్ట్రంలోనే మొట్టమొదటి సైన్స్ మ్యూజియాన్ని సంగారెడ్డి పట్టణంలో నిర్మించారు.

–ఇందులో భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, అంతరిక్షం, గణితం, ఎలక్ట్రానిక్స్ కు సంబంధించిన ప్రధానమైన 58ప్రయోగాలు ఏర్పాటు చేశారు.

–దేశ వ్యాప్తంగా పదుల సంఖ్యలో విద్యార్థులకు సైన్స్ మ్యూజియాలు ఉన్నా.. అందులో గణిత విభాగం అరుదే.

– ఇక్కడ పది ప్రయోగాలతో వంద సిద్ధాంతాలను వివరించేలా ప్రత్యేకంగా గణిత విభాగం ఏర్పాటు చేశారు.

–ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లో వచ్చే మొక్కలతో బోటానికల్ గార్డెన్ ఏర్పాటు చేశారు.

–మ్యూజియంను సందర్శించిన తర్వాత విద్యార్థులు సైన్స్ కు సంబంధించిన విడియోలు చూడటానికి ప్రత్యేకంగా మిని థియేటర్ ఏర్పాటు చేశారు.

–ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లో ఉన్న ప్రధాన ప్రయోగాలు, సిద్ధాంతాలను విద్యార్థులకు కళ్లకు కట్టేలా ఈ మ్యూజియం నిర్మించారు.

– సైన్స్ ఫేయిర్, సైన్స్ కాంగ్రెస్, మానక్ ఇన్ స్పైర్ వంటి పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా ఈ మ్యూజియం ప్రోత్సహిస్తుంది, కొత్త ఆలోచనలు కల్పిస్తుంది.

–కర్నాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఈ సైన్స్ మ్యూజియం ఆ రాష్ట్ర విద్యార్థులకు సైతం ఉపయోగపడనుంది.

ఈ కార్యక్రమంలో ఎంపీ, జిల్లా కలెక్టర్, మాజీ శాసనసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మొదటిసారిగా 10 మిలియన్ టన్నుల ఎగుమతులు అధిగమించిన పంచదార రంగం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19:భారతదేశ చక్కెర ఎగుమతులు 2013-14 ఆర్థిక సంవత్సరంలో 1,177 మిలియన్ల డాలర్ల నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరంలో 4600 మిలియన్ల డాలర్లు అంటే 291% వృద్ధిని సాధించాయి. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ (ఆఉఅఎఐ) గణాంకాల ప్రకారం, భారతదేశం ప్రపంచవ్యాప్తంగా 121 దేశాలకు చక్కెర ఎగుమతి చేసింది.

చక్కెర ఎగుమతులు 2021-22లో మునుపటి సంవత్సరంతో పోలిస్తే 65 శాతం పెరిగాయి. అధిక సరకు రవాణా ధరలు, కంటైనర్ కొరత మొదలైన అూఎఎఆ19 మహమ్మారి రూపంలో ఎదురైన రవాణా సవాళ్లు ఎన్ని ఉన్నప్పటికీ వృద్ధి సాధ్యం అయ్యింది.

కేంద్ర వాణిజ్యం పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, జౌళి శాఖల మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఒక ట్వీట్‌లో చారిత్రాత్మక విజయాన్ని హైలైట్ చేస్తూ, మోడీ ప్రభుత్వ విధానాలు ప్రపంచ మార్కెట్‌ల ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడంలో సహాయపడుతున్నాయని అన్నారు.

డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ ప్రకారం, భారతదేశం 2019-20లో 1965 మిలియన్ల డాలర్ల విలువైన చక్కెరను ఎగుమతి చేసింది, ఇది 2020-21లో 2790 మిలియన్ డాలర్లకు 2021-22లో 4600 మిలియన్లకు పెరిగింది.

2021-22 (ఏప్రిల్-ఫిబ్రవరి)లో, భారతదేశం ఇండోనేషియాకు 769 మిలియన్ డాలర్ల విలువైన చక్కెర ఎగుమతి చేసింది, తర్వాత స్థానాల్లో బంగ్లాదేశ్ (జూఆ 561 మిలియన్లు), సుడాన్ (జూఆ 530 మిలియన్లు) జ.ం.ఇ (జూఆ 270 మిలియన్లు) ఉన్నాయి. భారతదేశం కూడా సోమాలియా, సౌదీ అరబ్, మలేషియా, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, పాకిస్తాన్, నేపాల్, చైనా మొదలైన దేశాలకు చక్కెర ఎగుమతి చేసింది. అమెరికా, సింగపూర్, ఒమన్, ఖతార్, టర్కీ, ఇరాన్, సిరియా, కెనడా తో పాటు భారత తీపి దనాన్ని దిగుమతి చేసుకున్న దేశాల్లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, జర్మనీ, ఫ్రాన్స్, న్యూజిలాండ్, డెన్మార్క్, ఇజ్రాయెల్, రష్యా, ఈజిప్ట్ మొదలైనవి ఉన్నాయి. దేశంలోని మొత్తం చక్కెర ఉత్పత్తిలో దాదాపు 80 శాతం ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర కర్ణాటక వాటా. ఇతర చెరకు ఉత్పత్తి చేసే ప్రధాన రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, బీహార్, హర్యానా పంజాబ్.

ముఖ్యంగా, బ్రెజిల్ తర్వాత భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారు. 2010-11 నుంచి, భారతదేశం నిలకడగా మిగులు చక్కెర ఉత్పత్తి చేస్తోంది, ప్రస్తుతం దేశీయ అవసరాలు సౌకర్యవంతంగా మించి ఉత్పత్తి చేస్తుంది. రికార్డు ఎగుమతులు చక్కెర ఉత్పత్తిదారులు తమ నిల్వలను తగ్గించుకునేలా చేస్తాయి చెరకు రైతులకు కూడా ప్రయోజనం చేకూరుస్తాయి, ఎందుకంటే భారతీయ చక్కెర కు పెరిగిన డిమాండ్ వారి వాస్తవిక స్థితిని మెరుగు పరిచే అవకాశం ఉంది. వ్యవసాయ-ఎగుమతుల్లో గణనీయమైన పెరుగుదల దేశంలోని వ్యవసాయ శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతులను పెంచడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడానికి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా కూడా పరిగణిస్తారు.

ఎగుమతి అయ్యే ఉత్పత్తుల స్థిర నాణ్యత ధృవీకరణను నిర్ధారించడానికి, వ్యవసాయ అండ్ శుద్ఎధి చేసియన్స్ ఆహార వస్తువుల అభివృద్ధి సంస్థ -ంఖఇఆం విస్తృత శ్రేణి ఉత్పత్తులు ఎగుమతిదారులకు పరీక్ష సేవలను అందించడానికి భారతదేశం అంతటా 220 ప్రయోగ శాలలను గుర్తించింది.

ఆధునిక సాగు పద్ధతులతో లాభాలు : హరీశ్‌రావు

జహీరాబాద్, ఏప్రిల్ 19:: రైతులు ఆధునిక పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని, తద్వారా అధిక లాభాలు సాధించవచ్చని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా రేజింతల్‌లోని స్వయంభు సిద్ధి వినాయకుడిని మంత్రి మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన పాలీ హౌస్‌ను సందర్శించారు. అందులో సాగవుతున్న రంగురంగుల క్యాప్సికం, గెర్కిన్ పంటను పరిశీలించారు.సాగు విధానం, దిగుబడి, మార్కెటింగ్, ఆదాయం వంటి వివరాలను నిర్వాహకు లను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ వినియోగిస్తున్న సాంకేతికత, సాగు పద్ధతులపై స్థానిక రైతులకు అవగాహన కల్పించాలని హరీశ్‌రావు పాలీ హౌస్ నిర్వాహకులకు సూచిం చారు. అనంతరం మాణిక్‌రావుతో కలిసి మంత్రి జహీరాబాద్ మున్సిపాలిటీలో పరిధి లో నగరబాట లో భాగంగా పలు వారుల్లో సైకిల్‌పై పర్యటించారు. క్షేత్రస్థాయిలో మహి ళలను కలుస్తూ సమస్యలను అడిగి తెలుసు కొని, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చా రు.

హోంమంత్రిని కలిసేందుకు తరలివచ్చిన అధికారులు

అమరావతి, ఏప్రిల్ 19:తమిళనాడు ముఖ్యమంత్రిగా జయలలిత ఉన్నప్పుడు కొన్ని సీన్లు పదే పదే కనిపించేవి. అధికారులు కానీ, పొలిటికల్ లీడర్లు కానీ తనను కలవడానికి వచ్చినప్పుడు వంగి వంగి సాగిలపడి మరీ దండాలు పెట్టేవాళ్లు. అయితే ఇక్కడ సీన్ అంత కాకున్నా అట్లానే అనిపించేలా ఉందంటున్నారు చాలామంది పరిశీలకులు. ఆంధ్రప్రదేశ్ లో మొన్నటదాకా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న తానేటి వనితను ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు.

కానీ, ఏపీ నూతన హోంశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే అధికా రులంతా వరుసకట్టారు. మంత్రి వనితను మర్యాదపూర్వకంగా కలిశారు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోని ఉన్నతాధికారులు. ఈ సందర్భంగా వరుసకట్టి పూల బొకేలు అందిస్తూ కనిపించారు.

ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడు తోంది. సేమ్ టు సేమ్ తమిళనాడు సిస్టమ్‌ని గుర్తుకు తెస్తోందని కామెంట్స్ చేస్తున్నారు ఈ వీడియో చూసినవాళ్లు..

ఏపీ హోంమంత్రి తానేటి వనితతో ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి భేటీ అయ్యారు. నూతనంగా హోంశాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత మర్యాద పూర్వకంగానే మంత్రిని కలిసినట్లు డీజీపీ వివరించారు. ఈ సందర్భంగా పూలబొకే ఇచ్చి, మంత్రి వనితకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, పలు అంశాలపై ఇరువురూ చర్చించారు. అయితే ఏపీలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను కచ్చితంగా అమలు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అలాగే పీఎస్‌లోకి కచ్చితత్వం ఉన్న కేసులు వస్తే, వాటిని వెంటనే పరిష్కరించే దిశగా పోలీసులు చూడాలని హోంమంత్రి ఈ సందర్భంగా డీజీపీకి సూచించారు.

పోలవరం డ్యాం డిజైన్.. కొలిక్కి వచ్చేదెన్నడు..

అమరావతి, ఏప్రిల్ 19: పోలవరం ప్రధాన డ్యామ్ డిజైన్ల సమగ్ర ఆమోదం సాంకేతికంగా అంత సులభతరం కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. డ్యాం డిజైన్ లో దేశవ్యాప్తంగా ప్రఖ్యాతి చెందిన ఇంజనీరింగ్ నిపుణులు, సంస్థలు రూపొందించిన డిజైన్ ప్రతిపాదనలపై ఇంతవరకు ఏకాభిప్రాయం రాకపోవటమే దీనికి ప్రధాన కారణం. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), డీడీఆర్పీ (డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్), పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్), సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్), ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ చెన్నై ఇంజనీరింగ్ నిపుణులతో కూడిన కమిటీ సైతం ఇంతవరకు డిజైన్లను కొలిక్కి తీసుకురాలేకపోయింది. కేంద్ర జలశక్తి ప్రత్యేకంగా నియమనించిన ఢిల్లీ ఐఐటీ మాజీ డైరెక్టర్, రిటైర్డు ప్రొఫెసర్ వీఎస్ రాజు నేతృత్వంలోని కమిటీ చేసిన సిఫార్సులపైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావటంతో డిజైన్ వివాదం మళ్లీ మొదటికొచ్చింది. 2020లో గోదావరిలో వరద పోటెత్తింది. ఊహించని స్థితిలో 23 లక్షల క్యూసెక్కుల వరద ఉధృతికి అప్పటికే ఆమోదం పొంది నిర్మాణంలో ఉన్న దయాఫ్రం వాల్ దెబ్బతింది. నదీగర్భం కోతకు గురయింది. దయాఫ్రం వాల్ చుట్టూ సుడులు ఏర్పడి భారీ గొయ్యి ఏర్పడింది.పోలవరం ప్రాజెక్టులో కీలక నిర్మాణమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ గ్యాప్-1, గ్యాప్-2కు సమీపంలో కోతకు గురయిన నదీ గర్భాన్ని తిరిగి పటిష్ట స్థాయిలో పూర్వచ్ఛట ఇపుడు ఇంజనీరింగ్ నిపుణులకు సవాల్ గా మారింది. సాంకేతికంగా ఎలాంటి ఇబ్బంది ఎదురైనా మున్ముందు ప్రాజెక్టు దెబ్బతినే అవకాశం ఉంది. అందువల్లనే ఈ విషయంలో కేంద్ర జలశక్తి ఆచితూచి వ్యవహరిస్తోంది. ఫలితంగా గ్యాప్-2లో 550 మీటర్లు, గ్యాప్-1లో 1,750 మీటర్ల పొడవున ప్రధాన డ్యామ్ డిజైన్ల తుది ఆమోదం వాయిదా పడుతూ వస్తోంది. నీటిని తోడకుండానే గంతలు ఉన్న ప్రదేశాల్లో పొరలు పొరలుగా ఇసుక వేస్తూ డెన్సిఫికేషన్ చేయటం వల్ల కోతకు గురయిన ఇసుకపొరలన్నీ పటిష్టమవుతాయని వెల్లడిస్తూ వైబ్రో కాంపక్షన్, డెన్సిఫికేషన్, స్టోన్ కాలమ్ విధానాలను వి.ఎస్ రాజు నేతృత్వంలోని కమిటీ ప్రతిపాదించింది. దీనిపై డీడీఆర్పీ (డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్) చైర్మన్ ఏబీ పాండ్యతో పాటు మరికొందరు ఇంజనీరింగ్ నిపుణులు అనేక సందేహాలు లేవనెత్తారు. దీంతో ఇప్పటికే నిర్వహించిన సమావేశాలన్నీ అసంపూర్తిగా ముగియటంతో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ సలహాదారు వెదిరె శ్రీరాం నేతృత్వంలో ప్రత్యేక బృందం కోతకు గురయిన ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఈనెల 22, 23న పోలవరంలో పర్యటిస్తోంది.అనేక సంప్రదింపుల తరువాత కోతకు గురయిన నదీ గర్భం ప్రాంతాన్ని పటిష్టం చేసి ప్రధాన డ్యాం డిజైన్ కు సమగ్ర ఆమోదాలపై చర్చించేందుకు పోలవరం పర్యటిస్తున్న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం తన వెంట (సీడబ్ల్యూసీ), డీడీఆర్పీ (డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్), పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్), సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్), ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ చెన్నై ఇంజనీరింగ్ నిపుణులను కూడా తీసుకువస్తున్నారు. 22న పోలవరాన్ని సందర్శించనున్న బృందం 23న రాజమండ్రిలో ప్రత్యేక సమావేశం నిర్వహించనుంది. రాష్ట్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ నిపుణులు, మేఘా కంపెనీ ప్రతినిధులు కూడా నిపుణుల బృందం పర్యటనలో పాల్గొననున్నారు.

నదీగర్భం కోతను పూడ్చి పటిష్టం చేసే విధానంతో పాటు దానికయ్యే వ్యయంపైనా ఈ పర్యటనలో చర్చించనున్నారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల మధ్య ఉన్న నీటిని తోడేందుకయ్యే మొత్తం ప్రాజెక్టు విలువను సుమారు రూ.2,100 కోట్లుగా నిపుణులు నిర్ధారించారు. అంతటి భారీ వ్యయాన్ని తగ్గించే మరో ప్రత్యామ్నాయ విధానాన్ని కూడా రూపొందించారు. డ్రెడ్జింగ్‌తో ఇసుక కోత నివారించవచ్చనీ, దీనికి రూ.880 కోట్లు ఖర్చు చేస్తే సరిపోతుందని మరో నివేదిక సిద్ధం చేశారు. ఈ రెండు విధానాలపైనా సమావేశంలో చర్చించనున్నారు. ప్రాజెక్టు భవిష్యత్, భద్రతా ప్రమాణాలే ప్రాతిపదికగా తీసుకునే నిర్ణయం పట్ల ఆచితూచి వ్యవహరించాలని కేంద్ర జలశక్తి భావిస్తోంది. దీనిపై వివిధ దేశాల్లోని ప్రధాన జలవనరుల ప్రాజెక్టుల్లో సమస్య ఏర్పడినపుడు అనుసరించిన విధా నాలపైనా చర్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలవరం ప్రధాన డ్యామ్ డిజైన్ సమస్య ఈ సమావేశాల్లోనే కొలిక్కి వస్తుందా.. మరికొంత సమయం పడుతుందా అనేది వేచి చూడాలి.

ఏప్రిల్ 21న నేషనల్ అప్రెంటిషిప్ మేళా

సంగారెడ్డి ఏప్రిల్ 19 (నేటి నిజం ప్రతినిధి) ఈ నెల 21న సంగారెడ్డి లోని ప్రభుత్వ ఐఐటి కళాశాల లో నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ కె. రాజేశ్వరరావు మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.

సుమారు 20 నుండి 40 కంపెనీలు ఈ మేళాలో పాల్గొననున్నట్లు తెలిపారు. అప్రెంటిషిప్ రిజిస్ట్రేషన్ www.apprenticeshipindia.gov.in వెబ్సైట్లో నమోదు చేసుకోవాలన్నారు. వెబ్ సైట్ లో రిజిస్ట్రేషన్ చేసుకోని వారు ఐటిఐ లో చేసుకోవచ్చన్నారు.ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించు నేషనల్ అప్రెంటీస్ షిప్ మేళాను ఐటిఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అభ్యర్థులు సంగారెడ్డి ఐటిఐ లో ఏప్రిల్ 21న ఉదయం 10 గంటలకు నిర్వహించు నేషనల్ అప్రెంటిస్షిప్ మేళాకు నిర్ణీత సమయంలోగా హాజరుకావాలని సూచించారు.

మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9848935146/ 9440968924 / 9493014844 లలో సంప్రదించాలని రాజేశ్వరరావు సూచించారు.

మహిళా జర్నలిస్టులకు శిక్షణా తరగతులు..!

సంగారెడ్డి, ఏప్రిల్ 19 (నేటి నిజం ప్రతినిధి) రాష్ట్రంలోని మహిళా జర్నలిస్టులకు తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా తరగతులు ఈ నెల 23, 24 తేదీలలో హైదరాబాదులో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు మంగళవారం నాడు ఒక ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులపాటు జరిగే శిక్షణా తరగతులలో పాల్గొనదలచిన జిల్లాకు చెందిన మహిళా జర్నలిస్టులు తమ పేర్లను జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

శిక్షణా తరగతులలో "మహిళల ప్రత్యేక అస్తిత్వం-మీడియా లో మహిళల పాత్ర " మీడియా రంగంలో కొరవడుతున్న మహిళల ప్రాతినిధ్యం, మహిళ వార్తలు సమస్యల ప్రాతినిధ్యం, ఫీచర్ రైటింగ్స్, పత్రికల భాష తప్పులు దిద్దుబాటు, డిజిటల్ మీడియా అంశాలపై ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో నిష్ణాతులైన సీనియర్ జర్నలిస్టులు విశదీకరిస్తారని పేర్కొన్నారు. ఈ తరగతులలో అకాడమీ ప్రచురణలు మహిళా జర్నలిస్టులకు ఇవ్వడం జరుగుతుందన్నారు.

జిల్లాకు చెందిన మహిళా జర్నలిస్టులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 21 సాయంత్రం 5.గంటల లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

హైదరాబాద్, ఏప్రిల్ 19: రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా సో

గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సర్వం సిద్ధం.. ఈ వారంలోనే ఉంటుందన్న అధికారులు..

హైదరాబాద్, ఏప్రిల్ 19: గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సర్వం సిద్ధమైంది. నోటిఫికేషన్‌కు ముందు పూర్తి చేయాల్సిన అన్ని పనులను టీఎస్‌పీఎస్సీ చక్కదిద్దుకుంటోంది. ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా అన్ని అంశాలను పరిశీలిస్తూ జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈక్రమంలోనే సోమవారం టీఎస్‌పీఎస్సీ ప్రత్యేక సమావేశమై ఉద్యోగ ప్రకటనకు సంబంధించిన అంశాలు, ప్రకటన తేదీ, మార్కుల అంశాలను చర్చించినట్లు సమాచారం. నోటిఫికేషన్ విడుదలకు ముందు మరోసారి సమావేశమై గ్రూప్-1 నోటిఫికేషన్‌ను జారీ చేయాలని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈనెల 22న చివరి సమావేశాన్ని నిర్వహించి ఆ తర్వాత రెండు మూడు రోజుల్లో లేదా అదే రోజు నోటిఫికేషన్‌ను విడుదల చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

గ్రూప్-1, 2 పోస్టులకు ఇంటర్వ్యూలను రద్దు చేస్తూ ప్రభుతం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులను తొలగించి మిగిలిన మార్కులకే రాత పరీక్షను నిర్వహించే వీలుంది. ఇంటర్వ్యూలకు సంబంధించిన మార్కులను తీసేయగా గ్రూప్-1కు 900 మార్కులు, గ్రూప్-2కు 600 మార్కులే ఉండనున్నాయి. ప్రస్తుతం 503 ఉద్యోగాల భర్తీకి గ్రూప్-1 నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ఆ తర్వాత గ్రూప్-2కు కొంత సమయం తీసుకొని నోటిఫికేషన్ వేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే 503 గ్రూప్-1 పోస్టులకు సంబంధించిన ఇండెంట్లు, అభ్యర్థుల అర్హత వివరాలు టీఎస్‌పీఎస్సీకి చేరాయి.

మృతుడు అనిల్ కుటుంబాన్ని పరామర్శించి బియ్యాన్ని అందజేసిన సర్పంచ్, టీఆర్ఎస్ గ్రామ శాఖ

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 19:(నేటినిజం ప్రతినిధి): రుద్రవరం గ్రామానికి చెందిన మేడిచెల్మల అనిల్ అకాల మరణం చెందినందున వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ అతని పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని అని అన్నారు .అనంతరం కుటుంబ సభ్యులకు పార్టీ తరపున 25 కిలోల బియ్యం,,తన వ్యక్తిగతంగా సర్పంచ్ ఊరడి రాంరెడ్డి తరపున 25 కిలో బియ్యం అందజేసి తమ దానగుణన్ని చాటిచెప్పారు పరామర్శించిన వారిలో సర్పంచ్ ఊరడి రాంరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఊరడి ప్రవీణ్,ఉప సర్పంచ్ తాడెం శ్రీనివాస్, టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు సడిగొట్ల హరికృష్ణ, వార్డ్ సభ్యులు తునికి కనుకరాజు, ఎరుగోళ్ల అంజలి దేవయ్య, సడిగొట్ల స్వప్న హరికృష్ణ, పీఏ సీఎస్ డైరెక్టర్ లు వంకాయల రాజశేఖర్, కట్ట ఎల్లయ్య,మండల టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ,ఊరడి రాజిరెడ్డి (మెడికల్), గుండెల్లి రాజు, పార్వతి అంజయ్య,సంతపూరి మహేందర్ రెడ్డి, కూస మల్లారెడ్డి, ఎండీ భాషు,తుని కి శ్రీకాంత్, చిట్కూరి అశోక్, మదూరి రాజు తదితరులు ఉన్నారు

పులి రాంబాబును సన్మానించిన ఆర్యవైశ్య నాయకులు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 19:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంఛార్జిగా నియామకమైన పులి రాంబాబు గౌడ్ ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులి రాంబాబు గౌడ్ మరెన్నో ఉన్నత స్థాయి పదవులు చేపట్టాలని, శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కటకం జనార్దన్, ప్రధానకార్యదర్శి సిద్ధంశెట్టి వేణు, కోశాధికారి ఎరవెల్లి రాజశేఖర్, తాటిపెల్లి శ్రీనివాస్ మరియు గజవాడ మహేష్, పులి మల్లయ్య,తెదేపా పట్టణ అధ్యక్షుడు ముప్పిడి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే రమేష్ బాబు కృషితోనే ముంపు గ్రామాల అభివృద్ధి..

--జడ్పీటీసీ మ్యాకల రవి

--చీర్లవంచలో సీసీ రోడ్డుకు భూమిపూజ

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 19:(నేటినిజం ప్రతినిధి): ఎమ్మెల్యే రమేష్ బాబు కృషితోనే ముంపుగ్రామాలు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయని జడ్పీటీసీ మ్యాకల రవి అన్నారు. వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ గ్రామంలో ఎన్ఆర్ఈజిఎస్ నుండి మంజూరైన 10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను జడ్పీటీసీ మ్యాకల రవి మంగళవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మ్యాకల రవి మాట్లాడుతూ ముంపు గ్రామాల అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తున్నాయని అన్నారు. ఎమ్మెల్యే రమేష్ బాబు కృషితో ప్రతి గ్రామల్లో సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. అభివృద్ధే లక్ష్యంగా తెరాస ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తమ్మ-రాములు, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ దేవరాజు, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు భూమయ్య,మండల తెరాస నాయకులు బూర బాబు,గ్రామ ప్రజలు ,తదితరులు పాల్గొన్నారు...

గతం లో 25 ప్రాజెక్టులకు ఒకే రోజు భూమి పూజ చేసి చరిత్ర సృష్టించిన మేమే ఆ చరిత్రను తిరగ రాసే రోజు రావడం మాకు చాలా ఆనందంగా ఉంది. ఈ రోజు 33 ప్రాజెక్టులకు,ఆంధ్ర ప్రదేశ్ లో 25ఉ తెలంగాణ లో 9, భూమి పూజ చేసి రియల్ ఎస్టేట్ రంగం లో మరో కొత్త సంపూటి మొదలుపెట్టడానికి మా సంస్థ ఉద్యోగుల కృషి, మా కస్టమర్ల మరియు శ్రేయోభిలాషుల ప్రోత్సాహమే కారణం. రెండు రాష్ట్రాలలో 5 ప్రధాన నగరాలలో ఈ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి అన్నీ వర్గాల ప్రజలకి తక్కువ ధారాలలో నాణ్యమైన గృహాలు నిర్మించాలనే దృఢ సంకల్పంతో ముందడుగు వేస్తోంది మా హనీ గ్రూప్." అన్నారు హనీ గ్రూప్ ఛైర్మన్ ఉ మానేజింగ్ డైరెక్టర్ ముక్క ఓబుల్ రెడ్డి గారు. 2022లో రియల్ ఎస్టేట్ పరిశ్రమ, ఇళ్లు నిర్మించే విధానం, విక్రయించే పద్ధతి ఇంకా ప్రజల లైఫ్ స్టైల్ కూడా అపూర్వమైన మార్పుని చూస్తోంది. ఒకే రోజు విశాఖపట్నం-16, రాజమండ్రి-4, కాకినాడ-2, విజయవాడ-3, హైదరాబాద్-9మొత్తం 33 ప్రాజెక్టులకు భూమి పూజ చేసి హనీ గ్రూప్ నిర్మాణ రంగం లోనే ఒక బెంచ్ మార్కుని సెట్ చేసింది. కొత్త భవనాల రూప కల్పన, నిర్మాణం లో అనేక వినూత్న పద్ధతులతో హనీ గ్రూప్ ఇలాంటి మరెన్నో ప్రాజెక్టులను పూర్తి చేసే ప్రయత్నంలో ముందుకు వెళ్తోంది.

బనాస్ కాంతాలోని దియోదర్‌లో బనాస్ డెయరి సంకుల్‌లో అనేక అభివృద్ధి పథకాలను దేశ ప్రజలకు అంకితం చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19:గుజరాత్ లోని బనాస్ కాంతా జిల్లా లో గల దియోదర్ లో 600 కోట్ల రూపాయల కు పైగా ఖర్చు తో నిర్మాణం జరిగిన ఒక కొత్త డెయరి కాంప్లెక్స్ ను మరియు బంగాళాదుంపల ప్రోసెసింగ్ ప్లాంటు ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న దేశ ప్రజల కు అంకితం చేశారు. ఈ నూతన డెయరి కాంప్లెక్స్ ఒక గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టు గా ఉంది. ఇది రోజు కు దాదాపు 30 లక్షల లీటర్ ల పాల ను ప్రోసెస్ చేయడానికి, సుమారు 80 టన్నుల వెన్న ను, ఒక లక్ష లీటర్ ల ఐస్ క్రీమ్ ను, 20 టన్నుల ఘనీకృత పాల (ఖోయా) ను మరియు 6 టన్నుల చాక్ లెట్ ల ఉత్పత్తి కి వీలు కల్పిస్తుంది. పొటాటో ప్రోసెసింగ్ ప్లాంటు లో ఫ్రెంచ్ ఫ్రైజ్, ఆలూ చిప్స్, ఆలూ టిక్కీ, పేటీ లు మొదలైన ప్రోసెస్డ్ పొటాటో ప్రొడక్ట్ స్ ను తయారు చేసేందుకు ఏర్పాటు లు ఉన్నాయి. వీటి లో చాలా వరకు ఇతర దేశాల కు ఎగుమతి అవుతాయి. ఈ ప్లాంటు లు స్థానిక రైతుల కు సాధికారిత ను కల్పించి, ఆ ప్రాంతం లోని గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ను బలపరుస్తాయి. బనాస్ కమ్యూనిటీ రేడియో స్టేషను ను కూడా దేశ ప్రజల కు ప్రధాన మంత్రి అంకితం చేశారు. వ్యవసాయాని కి, పశుపాలన కు సంబంధించిన విజ్ఞాన శాస్త్ర సంబంధమైనటువంటి సమాచారాన్ని రైతుల కు అందించడం కోసం ఈ సాముదాయిక రేడియో కేంద్రాన్ని ఏర్పాటు చేయడమైంది. ఈ రేడియో స్టేషన్ ఇంచుమించు 1700 గ్రామాల కు చెందిన 5 లక్షల మంది కి పైగా రైతుల కు ఉపయోగపడనుంతుంది. పాలన్ పుర్ లోని బనాస్ డెయరి ప్లాంటు లో జున్ను ఉత్పత్తులకు సంబంధించిన, పాల విరుగుడు తేట ఉత్పత్తుల కు సంబంధించిన సామర్థ్యాన్ని విస్తరించిన విభాగాల ను దేశ ప్రజల కు ప్రధాన మంత్రి అంకితం చేశారు. గుజరాత్ లో దామా లో స్థాపించినటువంటి సేంద్రియ ఎరువు మరియు బయోగ్యాస్ ప్లాంటు ను కూడా దేశ ప్రజల కు ప్రధాన మంత్రి అంకితం చేశారు. ఖిమానా, రతన్ పురా- భీల్ డీ, రాధన్ పుర్ మరియు థావర్ లలో ఏర్పాటు కానున్న 100 టన్నుల సామర్థ్యం కలిగిన నాలుగు గోబర్ గ్యాస్ ప్లాంటుల కు సైతం ప్రధాన మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం లో పాలుపంచుకొన్న వారి లో గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర భాయీ పటేల్ తదితరులు ఉన్నారు.

ఈ కార్యక్రమాని కి హాజరు కావడానికన్నా ముందు, బనాస్ డెయరి తో తనకు ఉన్న అనుబంధాన్ని గురించి ప్రధాన మంత్రి ట్విటర్ లో తన మనోభావాల ను పొందుపరచారు. 2013వ మరియు 2016వ సంవత్సరాల లో బనాస్ డెయరి ని తాను సందర్శించినప్పటి ఛాయాచిత్రాల ను కూడా ట్వీట్ కు జత చేశారు. "గత కొన్నేళ్ళ లో, బనాస్ డెయరి స్థానిక సముదాయాలు, ప్రత్యేకించి రైతుల కు మరియు మహిళల కు సాధికారిత కల్పన లో ఒక కేంద్రస్థానం గా మారిపోయింది. మరీ ముఖ్యం గా వివిధ ఉత్పత్తుల ను తయారు చేయడం లో ఈ డెయరి ప్రదర్శిస్తున్నటువంటి నూతన ఉత్సాహాన్ని చూస్తూ ఉంటే నాకు గర్వంగా ఉంటోంది. తేనె పట్ల వారు అదే పని గా తీసుకొంటున్న శ్రద్ధ కూడా మెచ్చుకోదగ్గదిగా ఉంది." అని ప్రధాన మంత్రి అన్నారు. బనాస్ కాంతా ప్రజల ప్రయాస లు మరియు వారి లో తొణికిసలాడుతున్నటువంటి ఉత్సాహాన్ని కూడా శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసించారు. "బనాస్ కాంతా ప్రజానీకాన్ని వారి యొక్క కఠోర శ్రమ, ఇంకా వారి లో ఆటు పోటుల ను ఎదుర్కొనే స్థైర్యం.. వీటి ని నేను కొనియాడదలచాను. వ్యవసాయం లో ఈ జిల్లా వేసిన ముద్ర అభినందనీయమైంది గా ఉంది. రైతు లు కొత్త కొత్త సాంకేతిక మెలకువలను అలవరచుకొన్నారు, నీటి ని ఆదా చేయడం పై శ్రద్ధ వహించారు, మరి వీటి తాలూకు ఫలితాల ను అంతా గమనించవచ్చును." అని ప్రధాన మంత్రి అన్నారు.

ప్రధాన మంత్రి ఈ రోజు న తన ప్రసంగం మొదట్లో, మాత అంబా జీ యొక్క పవిత్రమైనటువంటి భూమి కి ఇవే నమస్సులు అని పేర్కొన్నారు. బనాస్ ప్రాంత మహిళల దీవెనల ను గురించి ఆయన ప్రస్తావించి, వారి అజేయ స్ఫూర్తి పట్ల తన గౌరవాన్ని వ్యక్తం చేశారు. భారతదేశం లో మాతృమూర్తుల మరియు సోదరీమణుల సశక్తీకరణ ద్వారా గ్రామాల తాలూకు ఆర్థిక వ్యవస్థ ను ఎలా బలోపేతం చేయవచ్చో అనేది, అలాగే సహకార ఉద్యమం ఆత్మనిర్భర భారత్ ప్రచార ఉద్యమాని కి ఏ విధం గా అండదండల ను అందించ గలదనేది ఎవరైనా ఇట్టే గ్రహించవచ్చును అని ప్రధాన మంత్రి అన్నారు. వారాణసీ లో కూడా ఒక భవన సముదాయాన్ని నెలకొల్పినందుకు గాను బనాస్ కాంతా ప్రజల కు మరియు బనాస్ డెయరి కి కాశీ యొక్క పార్లమెంటు సభ్యుని గా ప్రధాన మంత్రి తన కృతజ్ఞత ను వెలిబుచ్చారు.

బనాస్ డెయరి లో కార్యకలాపాల విస్తరణ ను గురించి ప్రధాన మంత్రి చెబుతూ, బనాస్ డెయరి కాంప్లెక్స్, జున్ను తయారీ ప్లాంటు, పాల విరుగుడు తేట ప్లాంటు.. ఇటువంటివి అన్నీ కూడా పాడి రంగం విస్తరణ లో ముఖ్యమైనవి. అయితే, బనాస్ డెయరి స్థానిక రైతుల ఆదాయాన్ని పెంచడాని కి ఇతర వనరుల ను కూడా ఉపయోగించుకోవచ్చును అని నిరూపించింది అని ప్రధాన మంత్రి అన్నారు. బంగాళాదుంపలు, తేనె, ఇంకా ఇతర సంబంధి ఉత్పత్తులు రైతు ల ప్రారబ్ధాన్ని మార్చుతున్నాయి అని ఆయన అన్నారు. పాడి రంగం ఫూడ్ ఆయిల్ మరియు వేరుసెనగల వంటి వాటి లోకి కూడా విస్తరిస్తోందని పేర్కొన్నారు. ఇది వోకల్ ఫార్ లోకల్ (స్థానిక ఉత్పత్తుల కొనుగోలు కు మొగ్గు చూపడం) అనే ప్రచార ఉద్యమాని కి కూడా దన్ను గా నిలబడుతోంది అని ఆయన అన్నారు. గోబర్ ధన్ లో పాడి సంబంధి ప్రాజెక్టు లను ఆయన ప్రశంసిస్తూ, చెత్త నుంచి సంపద ను సృష్టించాలి అనే దిశ లో ప్రభుత్వ ప్రయాసల కు సమర్థన గా అటువంటి ప్లాంటుల ను దేశం అంతటా ఏర్పాటు చేయడం ద్వారా డెయరి ప్రాజెక్టు లు సహాయకారి అవుతున్నాయన్నారు. పల్లెల లో స్వచ్ఛత ను పరిరక్షించడం ద్వారా ఈ ప్లాంటు లు లాభపడతాయి. పేడ (గోబర్) ద్వారా రైతుల కు ఆదాయాన్ని సమకూర్చుతాయి. విద్యుత్తు ఉత్పత్తి కి దోహదపడుతాయి; ఇంకా, ప్రాకృతిక ఎరువు తో భూమి కి సురక్ష చేకూరుతుంది అని ఆయన వివరించారు. ఆ తరహా ప్రయాస లు మన పల్లెల ను, మన మహిళల ను పటిష్టపరుయి; ధరణి మాత ను పరిరక్షిస్తాయి అని ఆయన అన్నారు.

గుజరాత్ వేసిన ముందంజల ను చూస్తే తనకు గర్వం గా ఉంది అని ప్రధాన మంత్రి అంటూ, నిన్నటి రోజు న విద్య సమీక్ష కేంద్రాన్ని తాను చుట్టి వచ్చిన సంగతి ని ప్రస్తావించారు. ముఖ్యమంత్రి నాయకత్వం లో ఆ కేంద్రం కొత్త శిఖరాల ను అందుకొంటోంది అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రస్తుతం ఈ కేంద్రం 54,000 పాఠశాలల తో పాటుగా, 4.5 లక్షల మంది టీచర్ లతో, 1.5 కోట్ల మంది విద్యార్థుల తో గుజరాత్ లో ఒక చైతన్యభరితమైనటువంటి కేంద్రం గా మారిపోయింది. ఈ కేంద్రం లో ఎఐ, మశీన్ లర్నింగ్, బిగ్ డేటా ఎనాలిటిక్స్ ల వంటివి నెలకొన్నాయి. ఈ కార్యక్రమం లో భాగం గా చేపట్టిన చర్యల తో పాఠశాలల్లో హాజరు 26 శాతం మేరకు మెరుగు పడింది అని ఆయన వివరించారు. ఇటువంటి ప్రాజెక్టు లు దేశం లో విద్య రంగ ముఖచిత్రం లో దూరగామి పరివర్తనల ను తీసుకు రాగలుగుతాయి అని ఆయన అన్నారు. ఈ తరహా కేంద్రాన్ని అధ్యయనం చేసి, ఇటువంటి కేంద్రాన్ని నెలకొల్పుకోవలసింది గా ఇతర రాష్ట్రాల కు, అధికారుల కు, సంబంధిత వర్గాల కు ప్రధాన మంత్రి సూచన చేశారు.

ప్రధాన మంత్రి గుజరాతీ భాష లో కూడా మాట్లాడారు. బనాస్ డెయరి సాధించిన పురోగతి పట్ల ఆయన తన సంతోషాన్ని మరోసారి వ్యక్తం చేసి, బనాస్ మహిళ ల ఉత్సాహాన్ని ప్రశంసించారు. బనాస్ కాంతా లో మహిళ లు వారి పశుగణాన్ని వారి సంతానం లాగా సంరక్షిస్తున్నారు అంటూ వారికి ఆయన ప్రణామాన్ని ఆచరించారు. బనాస్ కాంతా ప్రజల పట్ల ప్రధాన మంత్రి తన ప్రేమ ను పునరుద్ఘాటిస్తూ, తాను ఎక్కడి కి వెళ్ళినప్పటి కీ కూడాను వారి తో ఎల్లప్పటికీ బంధాన్ని కలిగివుంటానని పేర్కొన్నారు. "మీ పొలాల్లో ఒక భాగస్వామి మాదిరి గా నేను ఉంటాను" అని ప్రధాన మంత్రి అన్నారు.

బనాస్ డెయరి దేశం లో ఒక కొత్త ఆర్థిక శక్తి ని సృష్టించింది అని ప్రధాన మంత్రి అన్నారు. బనాస్ డెయరి ఉద్యమం ఉత్తర్ ప్రదేశ్, హరియాణా, రాజస్థాన్, ఒడిశా (సోమ్ నాథ్ నుంచి జగన్నాథ్ దాకా), ఆంధ్ర ప్రదేశ్ మరియు ఝార్ ఖండ్ వంటి రాష్ట్రాల లో రైతుల కు మరియు పశువుల ను పెంచే సముదాయాల కు సహాయకారి గా ఉంటోందని ప్రధాన మంత్రి అన్నారు. పాడి రంగం ప్రస్తుతం రైతుల ఆదాయాని కి తోడ్పడుతోంది అని ఆయన అన్నారు. 8.5 లక్షల కోట్ల రూపాయల పాల ను ఉత్పత్తి చేయడం ద్వారా పాడి రంగం సాంప్రదాయిక ఆహార ధాన్యాల కంటె కూడా రైతుల కు- మరీ ముఖ్యం గా కమతాలు చిన్నవి అయిపోయిన, పరిస్థితులు జటిలం గా మారిపోయిన చోట్ల- ఇంకా కాస్త పెద్దదైన ఆదాయ మార్గం గా ఎదుగుతున్నది అని ఆయన అన్నారు. రైతుల ఖాతాల లోకి ప్రత్యక్ష ప్రయోజనం బదలాయింపు ను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, ఇంతకు మునుపు రూపాయి లో కేవలం 15 పైసలు మాత్రమే లబ్ధిదారు కు చేరాయి అంటూ ఓ ప్రధాని గతం లో అభివర్ణించిన విధం గా కాకుండా ప్రస్తుతం ప్రయోజనాలు పూర్తి గా లబ్ధిదారుల కు అందుతున్నాయి అని పేర్కొన్నారు.ప్రాకృతిక వ్యవసాయం పై ప్రధాన మంత్రి తన శ్రద్ధ ను గురించి నొక్కి చెప్తూ, జల సంరక్షణ ను, బిందు సేద్యాన్ని బనాస్ కాంతా అక్కున చేర్చుకున్నట్లు గుర్తు కు తీసుకు వచ్చారు. నీటి ని వారు 'ప్రసాదం' గా మరియు బంగారం గా పరిగణిస్తూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సంవత్సరం లో మొదలుపెట్టి 2023వ సంవత్సరం లో స్వాతంత్ర్య దినం వచ్చే సరికల్లా 75 భవ్య సరోవరాల ను నిర్మించాలి అంటూ ప్రధాన మంత్రి విజ్ఞప్తి చేశారు.

దళితులు ఆర్థికంగా సామాజికంగా ఉన్నతంగా స్థిరపడాలి..!

- దళిత బందు కోసం బడ్జెట్లో 17800 కోట్లు కేటాయించాం.

-రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖల మంత్రి హరీష్ రావు.

సంగారెడ్డి, ఏప్రిల్ 18 (నేటి నిజం ప్రతినిధి) దళిత బందుతో దళితులు ఆర్థికంగా సామాజికంగా ఉన్నతంగా ఎదగాలని రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీష్ రావు కోరారు.

సోమవారం సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన దళిత బంధు కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు యూనిట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా దళిత బంధు అందిస్తున్నామన్నారు. అధికారులు సూచనలు మాత్రమే చేస్తున్నారని, లబ్ధిదారులు వారికి వచ్చిన పని ,నచ్చిన పని చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుని ముందుకు వెళుతుందన్నారు. దళిత బందు కింద 10 లక్షలు ఇస్తున్న ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదన్నారు.

లబ్ధిదారులు ప్రభుత్వం అందించిన దళిత బందుతో మరింత ఉన్నతంగా ఎదిగి సీఎం కోరుకున్న కలను నిజం చేయాలని లబ్ధిదారులకు సూచించారు.

దేశంలోని దళితులందరికీ. కేంద్ర ప్రభుత్వం 10 లక్షల చొప్పున ఇవ్వాలన్నారు.దళితుల ఉన్నతికి అందరం కలిసి పని చేద్దామని మంత్రి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలకు నవోదయ విద్యాలయాలు, వైద్య కళాశాలలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోని రైతులందరికీ ఉచిత కరెంటు ఇవ్వాలని, రైతుబంధు 10వేల చొప్పున ఇవ్వాలన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం మూడు ఏళ్లలో పూర్తి చేశామని, రేపో మాపో మల్లన్న సాగర్ ప్రాజెక్టు నుండి సంగారెడ్డికి గోదావరి నీళ్ళు తీసుకు వస్తామన్నారు.

కేంద్రం దళితుల కోసం పెట్టిన బడ్జెట్ ఎంతో చెప్పాలన్నారు. దేశం మొత్తం పెట్టిన దాని కంటే తెలంగాణ ప్రభుత్వం దళిత బంధు కోసం 17,800 కోట్లు పెట్టిందన్నారు.గుజరాత్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ లలో పవర్ హాలిడేలు ఉన్నాయని, దేశంలో పవర్ హాలిడే లేని ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ అని మంత్రి పేర్కొన్నారు.

అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేయడంతో పాటు రవాణా వాహనాలు, ఇతర యూనిట్లను మంత్రి ప్రారంభించారు. యూనిట్ల ప్రారంభానికి ముందు శాంతి కపోతాలు ఎగరవేశారు.

కార్యక్రమంలో ఎంపీ ప్రభాకర్ రెడ్డి, టిఎస్ఎంఎస్ఐడిసి ఛైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, జెడ్పి చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి,మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి , అధికారులు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం గిరిజన లంబాడీల రిజర్వేషన్లను 12 శాతానికి పెంచాలి..-పీసీసీ కార్యదర్శి ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 19:(నేటినిజం ప్రతినిధి):టీఆరెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి కెసిఆర్ గిరిజన లంబాడీలకు 6 శాతం ఉన్న రిజర్వేషన్ 12 శాతం పెంచాలని పీసీసీ కార్యదర్శి ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం

లంబాడీల గిరిజన జిల్లా అధ్యక్షుడు నరేష్, రాష్ట్ర లంబాడీల గిరిజన కోఆర్డినేటర్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో వేములవాడ అంబేద్కర్ విగ్రహం నుండి సిరిసిల్ల అంబేద్కర్ వరకు చేపట్టిన పాదయాత్రలో ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ లంబాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.

వెంటనే గిరిజన లంబాడీలకు రిజర్వేషన్ పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలో గిరిజనులకు పోడు భూములు ఇస్తే ఇప్పుడు ఉన్నటువంటి

కేసీఆర్ ప్రభుత్వం

పోడు భూములను లాక్కునే ప్రయత్నం చేస్తుందని, గిరిజనులకు కెసిఆర్ ప్రభుత్వం ఏమి చేసింది లేదని గుర్తుచేశారు. ప్రభుత్వం గిరిజనులను అన్ని రకాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, నాయకులు చిలుక రమేష్, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కనికరపు రాకేష్, గిరిజన లంబాడి నాయకులు మహిళలు తదితరులు ఉన్నారు.

దళితబందు యూనిట్లు త్వరితగతిన గ్రౌండింగ్ త్వరగా పూర్తి చేయాలి ...!

మెదక్, ఏప్రిల్ 19 (నేటి నిజం ప్రతినిధి) దళితబందు యూనిట్లు త్వరితగతిన గ్రౌండింగ్ అయ్యేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని ప్రజావాణి హాల్ లో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి తో కలిసి దళిగత బందు యూనిట్ల గ్రౌండింగ్ ప్రగతిని సమీక్షిస్తూ మెదక్ నియోజక వర్గంలోని చందంపేట లో, అందోల్ నియోజక వర్గం లోని టేక్మాల్ లో యూనిట్లు గ్రౌండింగ్ కాగా నరసాపూర్ లో ఇంతవరకు ప్రారంభించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. యూనిట్లు గ్రౌండింగ్ చేయుటకు నరసాపూర్ శాసనసభ్యులు సుముఖంగా ఉన్నారని వారి అనుమతితో వెంటనే యూనిట్లు ప్రారంబించాలని సూచించారు. దళిత బందు మొదటి దశలో జిల్లాలో 256 యూనిట్లు మంజూరు చేసి ఇంతవరకు 210 యూనిట్లకు 8 కోట్ల 37 లక్షల రూపాయల లబ్ధిదారులకు అందించామని అన్నారు. ఈ సంవత్సరం ప్రతి నియోజక వర్గానికి 1500 చొప్పున యూనిట్లు మంజూరు చేయవలసి ఉన్నందున ప్రస్తుత యూనిట్లను త్వరితగతిన అమలు చేస్తేనే లోటుపాట్లు, సమస్యలు తెలుస్తాయని, భవిష్యత్తులో వాటిని అధిగమించవచ్చని అన్నారు. వ్యవసాయ, పాడి పరిశ్రమ, దుకాణాలు వంటి యూనిట్లు ఏర్పాటు చేసుకునే వాటిలో దశలవారీగా పనులు చేపడుతూ నిధులు మంజూరు చేయవలసి ఉంటుందని, అధికారులు ఆ విధంగా ముందుకెళ్లాలని అన్నారు. కొందరు లబ్ధిదారులు ఒక యూనిట్ ఎంచుకొని తీరా గ్రౌండింగ్ సమయానికి మరో యూనిట్ కు వెళుతున్నారని, అటువంటివి సంబంధిత ఎమ్మెల్యే ఆమోదంతో మార్పు చేయాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ యూనిట్ల నెలకొల్పనకు కావలసిన సహాయా సహకారాలు లబ్ధిదారులకు అందిస్తూ త్వరితగతిన యూనిట్లు గ్రౌండింగ్ చేయాలన్నారు. లబ్ధిదారులకు ఖర్చు తగ్గించాలని ఉద్దేశ్యంతో కొన్ని సంస్థలు, ఏజెన్సీ లతో సమావేశమై ధరలు తగ్గించామని, కానీ లబ్ధిదారులు అక్కడే తీసుకోవాలని ఒత్తిడి చేయవద్దని ప్రతిమ సింగ్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్.డి.ఓ. సాయి రామ్, దళిత బందు ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరెపల్లిలో వాటర్ ప్లాంట్ స్థాపనకు సాకారం..

-ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 210701 అందజేత